క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్

14-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక:235

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



పోలీస్ శాఖ భారీ ప్రక్షాళన!

హైదరాబాద్ సిపి సజ్జనార్ బదిలీ

అక్కున సబర్వాల్ కు కీలక పోస్టింగ్

తెలంగాణ ప్రభుత్వం దూకుడుగా నిర్ణయాలు

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణ పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన. రేవంత్ సర్కార్ అనూహ్యమైన రీతిలో నిర్ణయాలు తీసుకుంది. ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన

మిగతా 2,లో



హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్ భగవత్

పోలీస్ కమిషనరేట్ లో పదవీ బాధ్యతలను స్వీకరించిన మహేశ్ భగవత్

శాంతిభద్రతలు, మహిళా భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యమని వెల్లడి

భూ తగాదాలు, పదేపదే నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరిక

తెలంగాణ రేరా సంచలన తీర్పు!

మోడీ బిల్డర్స్ కు రూ.20 లక్షల జరిమానా

తప్పుడు ప్రచారంతో కొనుగోలుదారులకు మోసం చేసినందుకు..

హైదరాబాద్ రియల్ రంగంలో సంచలనం

తెలంగాణలో అనూహ్య పరిణామం. హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించి.. తప్పుడు ప్రచారాలతో ఆకర్షించిన ప్రముఖ నిర్మాణ సంస్థ మోడీ బిల్డర్స్, దాని అనుబంధ సంస్థలకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ భారీ షాక్ ఇచ్చింది. లగ్జరీ విల్లా గేటెడ్ కమ్యూనిటీగా ప్రచారం చేస్తూ విక్రయాలు జరిపి.. అధికారికంగా మాత్రం ప్లాట్ల లేఅవుట్ గా నమోదు చేసిన ఉదంతంలో.. నిబంధనల ఉల్లంఘనను తెలంగాణ రేరా తీవ్రంగా స్పందించింది.



క్రైమ్ మిర్రర్, హైదరాబాద్: ఏకంగా 20 లక్షల భారీ జరిమానా విధించింది. ఇచ్చిన ఆదేశాలను గడువులోగా పాటించకపోతే రేరా చట్టంలోని సెక్షన్ 63 కింద మరిన్ని కట్టిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఏం జరిగిందంటే..: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లి దయ్యారా పరిధిలోని గోల్డెన్ కౌంటి ప్రాజెక్టుకు సంబంధించి ఓ వివాదం తెరపైకి వచ్చింది. ఆ ప్రాజెక్టులో కొనుగోలు చేసిన

- మిగతా 2వ పేజీలో



ఇండియాపై చైనా విషం!

పేద దేశం అంటూ అంతర్జాతీయ వేదికపై ప్రచారం

భారత్ ఎదుగుదల సహించలేక కుట్ర పన్నుతున్న అక్కడి స్థీమర్లు

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: భారత్ పై చైనా కుట్రలు ఆగడం లేదు. ఇండియా ప్రతిష్టను దిగజార్చేందుకు కొందరు చైనా కంటెంట్ క్రియేటర్లు వికృతి చేష్టలకు పాల్పడుతున్నారు. అంతర్జాతీయ వేదికలపై పలుచన చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అటువంటివారు బంగ్లాదేశ్ వేదికగా అడ్డంగా దొరికిపోయారు. బంగ్లాదేశ్ రాజధాని దాకాలోని అత్యంత

మిగతా 2,లో

పారిశ్రామిక రంగంలోకి మంచు ఫ్యామిలీ!

కర్నూలు జిల్లా ఓర్వకల్లు లో రూ.36 కోట్లతో పరిశ్రమ

ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న భూమా మౌనిక



క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం

మంచు మనోజ్, భూమా మౌనిక రెడ్డి దంపతులు ఒక కొత్త పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో వీరి ప్లాంట్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నారు.

విశాఖ వేదికగా జరుగుతున్న 31 వ సిఐఐ భాగస్వామ్య సదస్సు 2026 తొలి రోజున

మిగతా 2,లో



ఆరు లక్షల మంది గిగ్ వర్కర్లకు భరోసా..

నేటి నుంచే కొత్త పాలసీ అమలు!

ఇవాళ్టి నుంచి తెలంగాణలో గిగ్ వర్కర్స్ సంక్షేమ విధానం ప్రారంభం

పాలసీని ప్రకటించేందుకు హైదరాబాద్‌కు చేరుకున్న రాహుల్ గాంధీ

కార్మికుల సామాజిక భద్రత కోసం ప్రత్యేక చట్టం.. నిబంధనలు సిద్ధం

ఆన్‌లైన్ ఆర్డర్లను ఇళ్లకు చేర్చే డెలివరీ సిబ్బంది, యాప్‌ల ఆధారంగా సేవలందించే డ్రైవర్లు.. ఇలా రోజువారీ పనిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం కొత్త భరోసా కల్పించనుంది. ఇప్పటివరకు అనేక రంగాల్లో సేవలందిస్తున్న వీరికి సామాజిక రక్షణ కల్పించేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రూపొందించిన గిగ్ వర్కర్స్ పాలసీని నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది.

- మిగతా 2వ పేజీలో

యూపీలో కొత్త కూటమి!

చేతులు కలిపిన ఓవైసీ, ఆజాద్

బిజెపి, ఇండి కూటమికి వ్యతిరేకంగా..

దళిత్, ముస్లిం ఓటు బ్యాంకు కాంబినేషన్ గా..

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ : ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వచ్చే ఏడాది జరగనున్నాయి. అక్కడ ముస్లిం ఓటు బ్యాంకు అధికం. అందుకే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. కేవలం ముస్లిం ఓటు బ్యాంకు ను మాత్రమే కాదు

- మిగతా 2వ పేజీలో




సాయి రెడ్డికి షాక్!

ఇప్పటికే ఉన్న పార్టీ పేరు ప్రకటన

మార్పు అనివార్యమా?

సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: విజయసాయిరెడ్డి పార్టీ గతంలోనే రిజిస్టర్ అయిందా? పరివర్తన రాజనీతి పార్టీ గతంలోనే నమోదయిందా?

- మిగతా 3వ పేజీలో

'అల్లూరి' జడ్పీ చైర్ పర్సన్ గా అనూహ్య ఎంపిక!

వంతల శాంతిని ఖరారు చేసిన జగన్

వైస్ చైర్మన్ గా రాంబాబు

ఎస్టీల్లో రెండు సామాజిక వర్గాలకు ప్రాధాన్యం

క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం : ఏపీలో పరిషత్ పోరు ముగిసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి

- మిగతా 2వ పేజీలో


రెండు కార్పొరేషన్లపై వైసీపీ గురి!

శ్రీకాకుళం బరిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ఇటీవల టిడిపి నుంచి పార్టీలో చేరిక

కాకినాడ నుంచి ప్రముఖ వైద్యురాలు సత్య శ్రీ

జగన్ వ్యూహాత్మక ఎంపిక



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: మున్సిపల్ రెండో దశ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా నాలుగు కార్పొరేషన్లకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే తొలి విడతలో వైసిపి దారుణంగా ఓడిపోయింది. అందుకే ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా తీసుకుని నాలుగు కార్పొరేషన్ల లో రెండింటి పై గురి పెట్టింది. ప్రధానంగా శ్రీకాకుళం, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ లను కైవసం చేసుకోవాలని చూస్తోంది. అందులో భాగంగా గట్టి అభ్యర్థులను రంగంలోకి దించుతోంది. దీంతో పోరు ప్రతిష్టాత్మకంగా మారనుంది.

టిడిపి తో అనుబంధం తెంచుకొని..

శ్రీకాకుళం కార్పొరేషన్ కు సంబంధించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేరును ప్రకటించింది

- మిగతా 3వ పేజీలో





ఆరు లక్షల మంది గిగ్ వర్కర్లకు భరోసా..

ఈ విధానం ద్వారా సుమారు ఆరు లక్షల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి ఈ విషయాలను ప్రకటించారు. గిగ్ వర్కర్ల సమక్షంలోనే నూతన విధానాన్ని అధికారికంగా ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు చెప్పారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోగా.. ఈరోజు ఆయన గిగ్ వర్కర్లతో ప్రత్యేకంగా సమావేశం అవుతారు. ఈ భేటీలో కార్మికుల కోసం ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ కార్యాచరణను రాహుల్ గాంధీ ప్రకటించనున్నారు. వారి అవసరాలు, భద్రతకు సంబంధించిన అంశాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన నిబంధనలు, వివిధ ప్రయోజనాలను ఈ సందర్భంగా వెల్లడించనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ రంగంలో పనిచేస్తున్న దాదాపు ఆరు లక్షల మందికి కొత్త విధానం ద్వారా ప్రయోజనం కలగనుంది. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. దాని అమలుకు అవసరమైన మార్గదర్శకాలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనను కూడా పూర్తి చేసింది. తాజాగా పాలసీ అమలుకు తేదీని ఖరారు చేయడంతో ఈ రంగంలోని కార్మికులకు ప్రభుత్వ పరంగా భద్రత కల్పించే ప్రక్రియ ప్రారంభం కానుంది.

పారిశ్రామిక రంగంలోకి మంచు ఫ్యామిలీ!

ఈ దంపతులు స్థాపించిన స్టార్టప్ నమస్తే వరల్డ్ ఎంవో యూ చేసుకుంది. పారిశ్రామికవేత్త హోదాలో, నమస్తే వరల్డ్ వ్యవస్థాపకురాలిగా పాల్గొన్న భూమా మౌనిక రెడ్డి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. మంచు మనోజ్, భూమా మౌనిక దంపతులు ఎంతో అభివృద్ధితో ప్రారంభించారు ఈ సంస్థను. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పిల్లల ఆట బొమ్మలు, హస్త కళా ఉత్పత్తులను రూపొందిస్తుంది ఈ సంస్థ. కేవలం స్వదేశీ కళాకారులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేశారు.

సదస్సు తొలిరోజులో..

విశాఖలో జరిగిన సిఐఐ తొలి రోజు సదస్సులో భాగంగా ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హస్త కళాకారులు, ఎన్నో కలలతో ముందుకు వస్తున్న యువ పారిశ్రామికవేత్తలు ఒకే వేదికపై రావడం ఎంతో సంతోషాన్నిస్తోందని మౌనిక తెలిపారు. విశాఖపట్నం ఇంతమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆతిథ్యం ఇవ్వడం పై ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు జరుగుతున్న నిర్వహణ తీరును ప్రశంసించారు. ఈ మెగా ఈవెంట్ ను ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఇంత అద్భుతంగా తీర్చిదిద్దిన ఏపీ ప్రభుత్వానికి, నిర్వహణ సంస్థలకు, మీడియాకు, సదస్సుకు తరలివచ్చిన ఇన్వెస్టర్లకు భూమా మౌనిక శుభాకాంక్షలు తెలిపారు.

వివాహం తర్వాత వివాదం..

కొన్నేళ్ల కిందట మంచు మనోజ్ బాబును వివాహం చేసుకున్నారు భూమా మౌనిక. అనంతరం మోహన్ బాబు కుటుంబంలో అనేక రకాల పరిణామాలు చోటు చేసుకున్నాయి. తండ్రి కొడుకుల మధ్య గొడవలు కూడా జరిగాయి. ఆ కుటుంబానికి మనోజ్ దూరమయ్యారు కూడా. అయితే క్రమేపి ఆ కుటుంబ వివాదాలు సమసిపోయినట్టు కనిపిస్తున్నాయి. ఓవైపు మంచు మనోజ్ సినిమాల్లో రాణిస్తున్నారు. అదే సమయంలో భూమా మౌనిక రాజకీయ ప్రవేశం ఉంటుందని మనోజ్ ప్రకటించారు. ఇప్పుడు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. పర్యాటక సాంస్కృతిక రంగానికి సంబంధించిన వ్యాపారాన్ని ఎంచుకున్నారు. ఇప్పుడు ఏకంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వంతో ఒప్పందం కూడా చేసుకున్నారు.

హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్ భగవత్

హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేశ్ భగవత్ బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ కమిషనరేట్ లోని తన ఛాంబర్ లో సంబంధిత ఫైళ్లపై సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం నూతన సీపీ మహేశ్ భగవత్ మీడియాతో మాట్లాడుతూ తమ ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. "హైదరాబాద్‌లో శాంతి భద్రతలు, మహిళా భద్రత, ట్రాఫిక్ వంటివి కీలక అంశాలు. ప్రతి ఏటా 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. అందుకే ఈ అంశాలకు మేము ప్రాధాన్యమిస్తాం. మరోవైపు భూమి విలువ పెరగడం వల్ల భూ తగాదాల్లో దాడులు జరుగుతున్నాయి. వీటిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. నగరంలో పదేపదే నేరాలకు పాల్పడే అలవాటున్న నేరగాళ్లపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లో సైబర్ నేరాల కట్టడి, డయల్ 100, 112 ఎమర్జెన్సీ సేవల బలోపేతం, విజిబుల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

పోలీస్ శాఖ భారీ ప్రక్షాళన!

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ కు షాక్ తప్పలేదు. అత్యంత కీలకమైన పోస్టులో కొనసాగుతున్న ఆయనను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ప్రాధాన్యత తక్కువగా ఉండే తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ గా బదిలీ చేశారు. అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ బాధ్యతలను అప్పగించారు. అయితే సజ్జనార్ వంటి కీలక అధికారిని లూప్ లైన్ తరహా విభాగానికి పంపడం వెనుక ప్రభుత్వ అంతర్గత వ్యూహాలు బలంగా పనిచేశాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మురళి భగవత్ కు కమిషనర్ బాధ్యతలు..

ఈ బదిలీల్లో మరో కీలక పరిణామం. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2001 బ్యాచ్ అధికారి అక్కున సబర్వాల్ కు ప్రభుత్వం అత్యంత కీలకమైన పవర్‌ఫుల్ పోస్టింగ్ ఇచ్చింది. ప్రాధాన్యతను చాటుకుంది. సబర్వాల్ ను రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా నియమించడంతోపాటు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల అదనపు బాధ్యతలను కూడా అప్పగించింది. ఇక సజ్జనార్ స్థానంలో కొత్త హైదరాబాద్ పోలీస్ కమిషనర్ గా 1995 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన శాంతిభద్రతల విభాగం డిజిపిగా పనిచేశారు. గతంలో రాచకొండ కమిషనర్ గా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

నియామకాలు ఇలా..

పోలీస్ శాఖలో ప్రక్షాళనలో భాగంగా అవినీతి నిరోధక శాఖ, నిఘా, ఆర్టీసీ, పౌరసరఫరాల విభాగాల్లోనూ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిని చారు సిన్హాను పూర్తిస్థాయి ఏసీబీ బిజీగా నియమిస్తూనే సిఐడి డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు కొనసాగించింది. మల్టీ జోన్ 18 గా ఉన్న చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్గా బదిలీ చేసింది. గ్రేహౌండ్స్ ఆపరేషన్ డిజిపిగా ఉన్న డాక్టర్ అనిల్ కుమార్ టి జి ఎస్ ఆర్ టి సి ఎండి గా నియమించింది. ఆర్టీసీ ఎండీ గా ఉన్న నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్ గా మార్చింది. సివిల్ సప్లై కమిషనర్ గా ఉన్న స్టీఫెన్ రవీంద్రను కొత్తగా ఏర్పాటు అయిన తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్మెంట్, రోడ్డు అండ్ రాయల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్గా నిర్మించింది. మహిళా భద్రత విభాగం డిజిపిగా డాక్టర్ సౌమ్య మిశ్రా, జైల శాఖ డీజీగా స్వాతి లక్రా నియమితులయ్యారు.

పోలీస్ శాఖ పై పూర్తి పట్టు..

ఇంకోవైపు గ్రేహౌండ్స్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్, మల్టీ జోన్ వన్ ఐజిగా కార్తికేయ వంటి సమర్థులైన అధికారులను కీలక స్థానాల్లో నియమించడం ద్వారా రేవంత్ సర్కార్ పోలీస్ వ్యవస్థపై తన పట్టును మరింత బిగించినట్లు అయింది. త్వరలో జరగబోయే పాలనాపరమైన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటన నేపథ్యంలోనే ఈ భారీ మార్పులకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టమవుతుంది. కొందరు అధికారులకు లూప్ లైన్ పోస్టింగులతో షాక్ ఇస్తూనే.. అకుల్ సబర్వాల్, మహేష్ భగవత్ వంటి కీలక అధికారులకు కీలకమైన బాధ్యతలు అప్పగించడం ద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతలు, అవినీతి నిరోధక చర్యలు ప్రభుత్వం సరికొత్త వేగాన్ని ఆశిస్తోందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.


తెలంగాణ రేరా సంచలన తీర్పు!

(మొదటి పేజీ తరువాయి)

మహమ్మద్ ఉస్మాన్ సహా మరో 26 మంది బాధితులు సంయుక్తంగా రేరా అథారిటీని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మోదీ షెల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోడీ బిల్డర్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు తమ బ్రోచర్లు, ప్రచారాల్లో ఈ ప్రాజెక్టును అత్యాధునిక క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, జిమ్నాసియం, స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ల్యాండ్ స్కేప్ పార్కులతో కూడిన లగ్జరీ విల్లాగేటెడ్ టౌన్ షిప్ గా మార్కెటింగ్ చేశాయని పేర్కొన్నారు. కానీ వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు హెచ్ఎండిఏ నుంచి కేవలం ప్లాటెడ్ లేఅవుట్ కు మాత్రమే అనుమతులు ఉన్నాయి . రేరా వద్ద కూడా ఓపెన్ ప్లాట్ల ప్రాజెక్టుగానే రిజిస్టర్ చేసి తమను ఘోరంగా మోసం చేశారని బాధితులు ఆధారాలతో సహా నిరూపించారు.

తీర్పు చెంపపెట్టు..

అయితే బాధితుల నుంచి ఈ ఫిర్యాదు రావడంతో బిల్డర్ యాజమాన్యం తమను తాము సమర్థించుకునే ప్రయత్నం చేసింది. కొనుగోలుదారులకు ఈ విషయం ముందే తెలుసు అని బుకాయించే ప్రయత్నం చేసింది. ప్లాట్ కొనుగోలుకు, విల్లా నిర్మాణానికి వేరువేరుగా రెండు ఒప్పందాలు చేసుకున్నామని.. బుకింగ్ ఫారాల్లోనూ ఈ విషయం స్పష్టంగా ఉందని వాదించింది. అయితే ఈ వాదనలను టీజీ రేరా



ధర్మాసనం తోసి పుచ్చింది. ఒప్పందం చేసుకునే ముందు ప్రజలకు కొనుగోలుదారులకు చూపించే ప్రకటనలు, మార్కెటింగ్ మెటీరియల్ ఒకరకంగా ఉండి.. క్షేత్రస్థాయిలో మరోరకంగా విక్రయించడం పూర్తి చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది. ప్రాజెక్టు పేరు, మోడల్ విల్లాలు, ప్రచార తీరును బట్టి చూస్తే సంస్థ ఉద్దేశం, విల్లా టౌన్షిప్ ను విక్రయించడమేనని తేటతెల్లమవుతుందని.. రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారులను మభ్య పెట్టేందుకు బిల్డర్లు అనుసరిస్తున్న డ్యూయల్ అగ్రిమెంట్ ఎత్తుగడలను రేరా తప్పు పట్టింది. 20 లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఆదేశాలు ఇచ్చింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలోనే ఈ తీర్పు ఒక సంచలనంగా మారింది.

వికారాబాద్‌లో మహిళా క్రికెటర్ ఆత్మహత్య

తెలంగాణలోని వికారాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. బీసీసీఐ అండర్-19 మహిళా జట్టుకు ఎంపికైన వర్ధమాన క్రీడాకారిణి నందిని (17) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. స్థానిక యువకుల నుంచి ఎదురైన వేధింపులు భరించలేకే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చక్కని భవిష్యత్ ఉన్న యువ క్రికెటర్ అర్ధాంతరంగా తనువు చాలించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యాలాల మండలం సంగయ్యపల్లి గ్రామానికి చెందిన నందిని, క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యంతో వికారాబాద్ పట్టణానికి వచ్చింది. మధు కాలనీ సమీపంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ నిత్యం క్రికెట్ కోచింగ్ తీసుకుంటోంది. ఆమె కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఇటీవల బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపికైంది. త్వరలోనే ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉండగా ఈ విషాదం చోటుచేసుకుంది.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్, కృష్ణ అనే ఇద్దరు స్థానిక యువకులు గత కొంతకాలంగా నందినిని నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నారు. వారిలో ఒకరు ప్రేమ పేరుతో ఆమెను వేధించగా, మరొకరు అతనికి సహకరిస్తూ వచ్చారు. ఈ వేధింపులతో తీవ్ర మానసిక ఆందోళనకు గురైన నందిని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు యువకులపై దర్యాప్తు ప్రారంభించారు.

ఇండియాపై చైనా విషం!

(మొదటి పేజీ తరువాయి)

వెనుకబడిన మురికివాడలు, దుకాణాల వద్ద చైనాకు చెందిన లైవ్ స్ట్రీమర్లు కెమెరాలు పట్టుకుని సంచరిస్తూ.. ఆ ప్రాంతాన్ని భారత రాజధాని న్యూఢిల్లీ అంటూ ప్రచారం చేస్తున్నారు. భారతదేశంలో విపరీతమైన పేదరికం ఉందంటూ చైనా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని లైవ్ స్ట్రీమింగ్ చేస్తూ నెటిజన్లను తప్పుదోవ పట్టిస్తున్నారు. పక్క ప్రణాళికతో జరుగుతున్న ఈ దుష్ప్రచారాన్ని స్థానికంగా ఉన్న ఒక బంగ్లాదేశ్ టీవీ యాంకర్ స్వయంగా గుర్తించి నిలదీయడంతో ఈ అంతర్జాతీయ మోసం బయటపడింది.

అడ్డుకున్న బంగ్లా జర్నలిస్ట్..

ఓవైపు చైనాకు చెందిన స్ట్రీమర్లు లేనిపోని ప్రచారం చేస్తుండగా.. బంగ్లాదేశ్ జర్నలిస్ట్ రంగంలోకి దిగారు. అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇది బంగ్లాదేశ్ రాజధాని డాకా అని.. ఇక్కడి మురికివాడాలను చూపిస్తూ



భారతదేశపు రాజధాని న్యూఢిల్లీ అని వీక్షకులకు ఎందుకు అబద్ధాలు చెబుతున్నారంటూ కెమెరాల సాక్షిగా ప్రశ్నించారు. ఊహించని ఈ పరిణామంతో తీవ్ర షాక్కు గురైన చైనా స్ట్రీమర్లు సమాధానం చెప్పలేక.. ముఖం చాటేశారు. వాస్తవాలు బయటపడటంతో దొంగల పారిపోతున్న చైనీస్ స్ట్రీమర్ల దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

వ్యూస్ పెంచుకునేందుకే..

అయితే వారి ప్రయత్నం వెనుక సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. చైనీస్ వ్లాగర్లు తరచూ తమ మార్కెట్లు, చిన్న దుకాణాల వద్దకు వస్తుంటారు. భారతదేశానికి వ్యతిరేకంగా అవమానకర రీతిలో మాట్లాడుతుంటారు. భారతదేశ ఎంత పేద దేశమో చూడండి.. అక్కడి ప్రజలు తినడానికి తిండి కూడా దొరకదు.. భారతదేశంలో ఎంత దారుణంగా ఉందో లైవ్ లో చూడండి అంటూ చైనీస్ భాషలో తప్పుడు వ్యాఖ్యానం చేస్తూ వ్యూస్, ఫాలోవర్లను సంపాదించుకుంటారని బంగ్లాదేశ్ వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా భారతదేశ ఆర్థికంగా, సాంకేతికంగా ఎదుగుతున్న తరుణంలో.. చైనాలోని కొన్ని వర్గాలు అలాంటి చౌకబారు ప్రచారాలకు ఒడిగోడుతుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.


'అల్లూరి' జడ్పీ చైర్ పర్సన్ గా అనూహ్య ఎంపిక!

(మొదటి పేజీ తరువాయి)

క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం : ఏపీలో పరిషత్ పోరు ముగిసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఎదురైంది. ముఖ్యంగా జిల్లా పరిషత్ స్థానాల్లో ఒక్కదానికి మాత్రమే పరిమితం అయింది. 28 జిల్లాలకు గాను అల్లూరి సీతారామరాజు జిల్లాను మాత్రమే వైసిపి దక్కించుకుంది. అక్కడ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా వంతల శాంతి పేరును జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. అల్లూరి జిల్లా పార్టీ నాయకుల సమక్షంలోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలం నుంచి జడ్పిటిసి గా శాంతి గెలుపొందారు. అలాగే జడ్పీ వైస్ చైర్మన్గా పాడేరు జడ్పిటిసి సభ్యుడు రాంబాబు పేరును ప్రకటించారు. తాడేపల్లి వెళ్లిన అల్లూరి జిల్లా నేతల సమక్షంలోనే జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

వైసీపీకి పట్టు ఎక్కువ..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టు ఎక్కువ. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న పాడేరు, అరకు




నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టు ఎక్కువ. మొన్నటి ఎన్నికల్లో కూటమి ప్రభంజనం వీచింది. కానీ ఆ రెండు నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇప్పుడు పరిషత్తు ఎన్నికల్లో కూడా అదే పట్టును కొనసాగించింది. అల్లూరి జిల్లాలోని 11 జడ్పిటిసి స్థానాలకు గాను ఏడు చోట్ల వైసీపీ గెలిచింది. తద్వారా వైసిపికి జడ్పీపీఠం కైవసం అయింది.

సామాజిక ఎంపిక..

కొత్త జడ్పీ చైర్పర్సన్ వంతల శాంతి ఎస్టి పోడు సామాజిక వర్గానికి చెందినవారు. అల్లూరి జిల్లాలోని అరకులోయ, పాడేరు, ముంచంగిపుట్టు మండలాల్లో వీరి జనాభా అధికం. అందుకే కీలకమైన చైర్పర్సన్ పదవిని ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళ నేతను ఎంపిక చేశారు. ఇక కొండ దొర సామాజిక వర్గానికి చెందిన పాడేరు జడ్పిటిసి రాంబాబును వైస్ చైర్మన్ గా ఎంపిక చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం ఆయన పని చేశారు. వైసీపీకి దక్కిన ఏకైక జెడ్పి అల్లూరి సీతారామరాజు జిల్లా ది కావడంతో.. అక్కడ కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆ పార్టీ నేతలు జగన్మోహన్ రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

సాయి రెడ్డికి షాక్!



(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు విజయసాయిరెడ్డి పార్టీ పేరు మార్చుకోక తప్పదా? పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. ఎన్నికల సంఘం వద్ద ఒక రాజకీయ పార్టీ రిజిస్టర్ అయి ఉండడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఎన్నికల సంఘం అధికారిక రికార్డులు, వార్షిక ఆడిట్ నివేదికల పత్రాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈసీ పత్రాల ప్రకారం పరివర్తన రాజనీతి పార్టీ 2022 లోనే అధికారికంగా నమోదు అయి ఉంది. న్యూఢిల్లీలోని మయూర్ విహార్ ఫేజ్ 2, ఈస్ట్ వినోద్ నగర్ చిరునామాతో రిజిస్టర్ అయిన ఆ పార్టీకి ముఖేష్ అనే వ్యక్తి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. 2025 నవంబర్ 12న ఆ పార్టీ తరఫున ఎన్నికల సంఘానికి వార్షిక ఆడిట్ నివేదికలు, ఐ టి ఆర్ 7, విరాళాల నివేదికలను కూడా సమర్పించినట్లు రసీదులతో సహా స్పష్టమవుతోంది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఆరుముగం పోటీ చేసినట్లు కూడా ఈసీ రికార్డులు చెబుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం దేశంలో ఒకసారి ఒక పేరుతో రాజకీయ పార్టీ రిజిస్టర్ అయి ఉంటే... అదే పేరుతో లేదా దానికి దగ్గరగా ఉండే పేరుతో మరొక కొత్త పార్టీని నమోదు చేసేందుకు ఈసీ అనుమతించదు. ఒకవేళ విజయసాయిరెడ్డి సదరు ఢిల్లీకి చెందిన ముఖేష్ నేతృత్వంలోని పాత పార్టీని టేకోవర్ చేసుకుని.. దాని బాధ్యతలు తీసుకుని ఉంటే తప్ప ఆయనకు స్వతంత్రంగా పరివర్తన రాజనీతి పార్టీ పేరు దక్కి అవకాశం లేదు. దశాబ్దాల పాటు చార్టెడ్ అకౌంటెంట్గా, రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి లాంటి వ్యక్తి.. కనీసం ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో పేరు అందుబాటులో ఉందో లేదో సరి చూసుకోకుండానే 11-11-11 ముహూర్తం అంటూ పార్టీ పేరును ప్రకటించడం పై నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. చివరకు ఈ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

మెగాస్టార్ పిఠిల్పి పేరుతో..

వాస్తవానికి విజయసాయిరెడ్డి పార్టీ పేరు పి ఆర్ పి అనేసరికి మెగాస్టార్ చిరంజీవి పాత పార్టీ పేరు గుర్తుకు వచ్చింది. కానీ పరివర్తన రాజకీయ పార్టీ అనేసరికి అసలు విషయం తెలిసింది. హిందుత్వ వాదానికి దగ్గరగా ఉండేలా ఆయన ఈ పేరు పెట్టుకున్నారు. కానీ ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలినట్లు అయింది. అయితే విజయసాయిరెడ్డి కొత్తగా పార్టీ ఏర్పాటు చేయబోతారా? మళ్లీ పేరు మార్చుతారా? అనేది చూడాలి. ఇప్పటికే పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. ఈ పరిస్థితుల్లో అన్ని అధ్యయనం చేసి కొత్త పార్టీని ఏర్పాటు చేసి ఉంటారు. కానీ ఇప్పటికే రిజిస్టర్ అయిన పార్టీ పేరును పెట్టారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఆయన ఎలా స్పందిస్తారో చూడాలి.

రెండు కార్పొరేషన్లపై వైసీపీ గురి!

(మొదటి పేజీ తరువాయి)

హై కమాండ్. ఇటీవల ఆమె జగన్ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో సేవలందించిన గుండ కుటుంబం అనూహ్యంగా వైసీపీలో చేరింది. టిడిపిలో జరిగిన పరిణామాలతో కలత చెందిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి తన చిరకాల ప్రత్యర్థి ధర్మాన ప్రసాదరావు గూటికి చేరారు. శ్రీకాకుళం నగరంలో గుండ కుటుంబానికి మంచి పేరు ఉంది. అందుకే ఆమెను మేయర్గా ప్రత్యక్ష ఎన్నికల్లో బరిలో దించి విజయం అందుకోవాలని చూస్తోంది వైసిపి. ఇక్కడ జనసేనకు మేయర్ అభ్యర్థిని ఖరారు చేసింది కూటమి. ఆ పార్టీ అభ్యర్థిగా ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్ భార్య రంగంలోకి దిగబోతున్నారు. ఇక్కడ పోటీ రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

పార్టీలో చేరిన వెంటనే..

మరోవైపు కాకినాడ నుంచి సైతం గట్టి అభ్యర్థిని బరిలో దించాలని చూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ప్రముఖ వైద్యుడు డాక్టర్ కాడ వెంకటరమణ భార్య సత్య శ్రీ ని వైసిపి ఎంపిక చేసింది. ఆ డాక్టర్ దంపతులు వైసీపీలో చేరిన వెంటనే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. వాస్తవానికి కాకినాడ కార్పొరేషన్ లో వైసీపీ నుంచి చాలామంది ఆశావహులు ఉన్నారు. వారందరినీ పక్కనపెట్టి తటస్థులను రంగంలోకి దించడం ఆశ్చర్యపరిచింది. పార్టీతో సంబంధం లేని ఒక డాక్టర్ కుటుంబం నుంచి మేయర్ సీటుకు పోటీ పెడుతోంది.. సత్య శ్రీ ఇలా పార్టీలో చేరారో లేదో అలా మేయర్ అభ్యర్థిగా మారిపోయారు. సత్య శ్రీ ఎంపిక వెనుక మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్య పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. కాకినాడలో కూటమి బలం అధికం. పవన్ సొంత జిల్లా కావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. వ్యూహాత్మకంగా ఒక డాక్టర్ను రంగంలోకి దించుతోంది. మరి ఇందులో ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి.

మహిళలకు ఆర్టీసీ మరో వరం..
నెలవారీ పాస్‌పై 50 శాతం డిస్కౌంట్!

- టీజీఎస్ ఆర్టీసీ నెలవారీ పాస్‌లపై కొత్త రాయితీలు
- మహిళలకు మెట్రో, డీలక్స్ బస్సు పాస్‌లపై భారీ డిస్కౌంట్
- 15 రోజులకే నెల పాస్ పొందే సరికొత్త అవకాశం
- టోల్ చార్జీల తగ్గింపుతో తగ్గనున్న పాస్‌ల ధరలు
- సిటీ పాస్ ఉన్నవారికి ఆదివారాల్లో ఉచిత ప్రయాణం

టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. బస్సు ప్రయాణాన్ని మరింత ఆదాగా, సౌకర్యంగా మార్చే లక్ష్యంతో నెలవారీ సీజన్ టికెట్ల (ఎంఎస్‌టీ)పై పలు కొత్త రాయితీలు, సదుపాయాలను ప్రకటించింది. సవరించిన ఈ నిబంధనలు శనివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నట్లు స్పష్టం చేసింది.మహిళా ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నప్పటికీ.. మెట్రో, రాజధాని, డీలక్స్ వంటి సర్వీసుల్లో పాస్‌లు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అలాంటి వారి కోసం ఇకపై నెలవారీ రూట్ పాస్‌పై 50 శాతం రాయితీ కల్పించారు. అంటే, కేవలం 15 రోజుల రుసుము చెల్లిస్తే చాలు, నెల మొత్తం ప్రయాణించవచ్చు. ఉదాహరణకు, హైదరాబాద్-వరంగల్ రూట్ పాస్‌ను సగం ధరకే పొందవచ్చు.అంతేకాకుండా, పాస్‌ల ధరలను మరింత తగ్గించేందుకు టోల్ ప్లాజా చార్జీల లెక్కింపు విధానంలో మార్పులు చేసింది. ఇప్పటివరకు 25 రోజులకు లెక్కిస్తున్న టోల్ చార్జీలను ఇకపై 20 రోజులకు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దీనివల్ల అన్ని రకాల పాస్‌ల ధరలు స్వల్పంగా తగ్గనున్నాయి. కొత్తగా 'డీలక్స్ నెలవారీ సీజన్ టికెట్'ను కూడా ప్రవేశపెడుతున్నారు.

హైదరాబాద్ క్రికెట్ ప్రక్షాళనే లక్ష్యం.. రంగంలోకి అంబటి రాయుడు!

భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు పూర్తయ్యాయి. ఈ స్వల్ప కాలంలోనే తక్షణ ఫలితాల కంటే వ్యవస్థాగత ప్రక్షాళన, మౌలిక సదుపాయాల కల్పనపైనే ప్రధానంగా అంబటి దృష్టి సారించాడు. అతడి కృషితో రంజీ ట్రోఫీ ప్రస్తుత సీజన్ తొలి దశలో హైదరాబాద్ జట్టు మూడు విజయాలు, ఒక డ్రాతో ఎలైట్ గ్రూప్-బిలో 20 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.అయితే, ఈ ప్రాథమిక ఫలితాలను చూసి సంతృప్తి చెందడానికి రాయుడు సిద్ధంగా లేడు. తాము నిర్మిస్తున్న పటిష్టమైన వ్యవస్థలు, ఆటగాళ్లలో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే తనకు అసలైన సంతృప్తినిస్తున్నాయని అంబటి పేర్కొన్నాడు. జూనియర్ క్రికెటర్లకు అత్యధిక మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించడం (ఈ సీజన్‌లో దాదాపు వెయ్యి మ్యాచ్ రోజులు), దిగ్గజ ఆటగాడు వసీం జాఫర్‌ను మెంటార్‌గా నియమించడం, జిల్లా స్థాయి ఆటగాళ్లకు సైతం ప్రాతినిధ్యం లభించేలా ఓపెన్ ట్రయల్స్ నిర్వహించడం వంటి కీలక సంస్కరణలు చేపట్టాడు. ముఖ్యంగా సెలక్షన్ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేశాడు. ప్రతి ఎంపికకు గల కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేసి, జస్టిస్ పి. నవీన్ రావు నేతృత్వంలోని కమిటీకి సమర్పిస్తున్నారు. ఈ వినూత్న విధానాన్ని ఆయన 'డీఆర్ఎస్' (డెసిషన్ రివ్యూ సిస్టమ్)గా అభివర్ణించారు.

యూపీలో కొత్త కూటమి!

దళిత ఓటు బ్యాంకు ను కలుపుకొని మంచి ఫలితాలు సాధించాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఆజాద్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ తో చర్చలు జరిపి రాజకీయ పొత్తును ప్రకటించారు. లక్నో వేదికగా వీరిద్దరూ సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. యూపీలో కొత్తగా సామాజిక పరివర్తన మోర్చా పేరుతో మూడో కూటమికి తెర లేపారు. ఇండియా కూటమిలో తమకు స్థానం కల్పించాలంటూ సమాజ్వాది పార్టీ, కాంగ్రెస్ పార్టీలకు ఓవైసీ ఇచ్చిన గడువు ముగియడం, అఖిలేష్ యాదవ్ మొండి చేయి చూపడంతో.. ఓవైసీ నేరుగా చంద్రశేఖర్ ఆజాద్ తో జట్టుకట్టి యూపీలో దళిత, ముస్లిం కాంబినేషన్ సెట్ చేశారు.

మాయావతి లేకపోవడంతో..

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో దశాబ్దాలపాటు చెరగని ముద్ర వేశారు మాయావతి. దళిత ఓటు బ్యాంకుకు ఏకైక అధినేత్రిగా వెలుగొందారు. కని క్షేత్రస్థాయిలో ఆమె ప్రభావం పూర్తిగా కనిపించడం లేదు. ఆ రాజకీయ శూన్యతను ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ వేగంగా భర్తీ చేస్తున్నారు. ముఖ్యంగా యువ దళిత ఓటర్లలో ఆజాద్ కు పెరుగుతున్న ఆదరణను గుర్తించిన ఓవైసీ.. ముస్లిం మైనారిటీ ఓట్లను, దళిత ఓట్లను ఒకే గూడుపు కిందకు తెచ్చేందుకు ఈ వ్యూహాత్మక పొత్తు కుదుర్చుకున్నారు. బలహీన వర్గాలు, యువత, రైతుల హక్కుల కోసం తమకూటమి పోరాడుతుందని ఇరువురు నేతలు స్పష్టం చేస్తూనే.. ఇప్పటివరకు దళితులు, ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న ప్రధాన పార్టీలకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



కొత్త కూటమిపై చర్చ..

యూపీ రాజకీయాల్లో ఈ కొత్త కూటమి ఎటువంటి ప్రభావం చూపుతోందనే చర్చ జాతీయస్థాయిలో జరుగుతోంది. రాష్ట్రంలోని 403 అసెంబ్లీ స్థానాల్లో పశ్చిమ యుపి, పూర్వాంచల్ ప్రాంతాల్లోని సంబల్, రాంపూర్, మీరట్, నగీనా, అజంఘడ్, బహ్రాయిచ్ ప్రాంతాల్లో దళిత, ముస్లిం ఓట్లు గెలుపు ఓటములను శాసించే స్థాయిలో ఉన్నాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం గణనీయమైన సీట్లు గెలుచుకోవడం, పార్లమెంటు ఎన్నికల్లో చంద్రశేఖర్ ఆజాద్ సత్తా చాటడం వీరి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ కూటమి గణనీయమైన స్థాయిలో దళిత, ముస్లిం ఓట్లను చీల్చగలిగితే అది నేరుగా అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోనే సమాజ్ వాది పార్టీ, కాంగ్రెస్ కూటమి విజయవకాశాలను భారీగా గండి కొట్టడం ఖాయమని తెలుస్తోంది. మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తోంది బిజెపి. దానిని అడ్డుకోవాలని చూస్తోంది ఇండియా కూటమి. ఇప్పుడు మధ్యలో ఓవైసీ, ఆజాద్ జోడి ఆ రెండు వర్గాలకు అతిపెద్ద సవాల్ గా నిలవనుంది.

హైదరాబాద్ ఐటీ ఉద్యోగులకు గుడ్ న్యూస్.. ఐటీ కారిడార్‌లో వన్ వే లూప్ విధానం

- ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీకి పరిష్కార చర్యలు
- వన్ వే లూప్ విధానం అమలుకు పోలీసుల కసరత్తు
- ఐకియా, బయోడైవర్సిటీ జంక్షన్ల మధ్య కీలక మార్పులు
- ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ప్రణాళికలు
- డీజీపీకి మూడు ప్రతిపాదనలు వివరించిన అధికారులు

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రోజురోజుకు తీవ్రమవుతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సరికొత్త ప్రణాళికతో ముందుకొస్తున్నారు. ఐకియా, మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ వంటి అత్యంత రద్దీ జంక్షన్లను కలుపుతూ 'వన్ వే లూప్' విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఇది అమలైతే వాహనాలు సిగ్నళ్ల వద్ద ఆగకుండా నిరంతరాయంగా ఒకే మార్గంలో ప్రయాణించే వీలు కలుగుతుంది.ఐటీ కారిడార్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటోంది. ముఖ్యంగా ఆఫీసుల నుంచి ఉద్యోగులు ఒకేసారి బయటకు రావడంతో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పోలీసులు వన్ వే లూప్ విధానంపై దృష్టి సారించారు. దీని ద్వారా ఐకియా నుంచి బయోడైవర్సిటీ జంక్షన్‌కు, అక్కడి నుంచి టీ-వర్క్స్, మైహోం భుజా మీదుగా తిరిగి ఐకియా వైపు వాహనాలు ఒకే వలయాకార మార్గంలో ప్రయాణిస్తాయి.ఇప్పటికే కేబీఆర్ పార్కు చుట్టూ ఈ విధానం విజయవంతం కావడంతో, అదే తరహాలో ఇక్కడ కూడా అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలపై సైబరాబాద్ సీపీ ఎం. రమేశ్, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు డీజీపీ సీవీ ఆనంద్ కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ట్రాఫిక్ పోలీసులు సిద్ధం చేసిన మూడు రకాల ప్రతిపాదనలను డీజీపీకి వివరించారు. జీహెచ్ఎంసీ, టీఎస్ఐఐసీ అధికారులతో చర్చించిన అనంతరం, సాధ్యాసాధ్యాలను బట్టి ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

పదేళ్లలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చారా?

కేటీఆర్‌కు పొన్నం ప్రభాకర్ ప్రశ్నలు

- బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని మంత్రి విమర్శ
- ఫార్ములా ఈ రేసు, కాళేశ్వరం సహా పలు అంశాలపై కేటీఆర్‌ను నిలదీత

రాహుల్ గాంధీపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని వ్యాఖ్య

హైదరాబాద్: గత పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఎలాంటి భరోసా కల్పించారని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాల భర్తీని పట్టించుకోని నేతలు ఇప్పుడు అవినీతి గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న పలు వివాదాస్పద అంశాలను ప్రస్తావిస్తూ కేటీఆర్‌కు ప్రశ్నలు సంధించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన పొన్నం ప్రభాకర్.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు చేసే ముందు కేటీఆర్ ఆలోచించాలని సూచించారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన నేపథ్యం గాంధీ కుటుంబానికి ఉందని గుర్తుచేశారు. అలాంటి కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క




గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్-1 ప్రకటన జారీ చేయడంతో పాటు పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి, సామర్థ్యం ఉన్నాయని పేర్కొన్నారు.అవినీతి అంశాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్ తీరును పొన్నం తప్పుబట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫార్ములా ఈ రేసు వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, అసైన్డ్ భూముల కేటాయింపులకు సంబంధించిన అంశాలపై కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న పలు ఘటనలను కూడా మంత్రి ప్రస్తావించారు. నేరెళ్లలో దళితులపై దాడులు, ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేయడం, మల్లన్నసాగర్ నిర్వాసితులపై లాఠీఛార్జ్ వంటి ఉదంతాలు అప్పటి పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రతిబింబిస్తున్నాయని విమర్శించారు. ఈ అంశాలపై సమాధానం చెప్పకుండా అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని పొన్నం ప్రభాకర్ తన పోస్టులో పేర్కొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 | శనివారం | 14-11-2026

చండూరులో ప్రారంభమైన అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

నేడు చండూరులో ప్రతిష్ఠా విగ్రహాల భారీ ఊరేగింపు

14,15,16 మధ్యాహ్నం వేళలో పెద్ద ఎత్తున సాగనున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం



చండూరు, క్రైమ్ మిర్రర్ఃచండూరులో నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రారంభమైంది. అయ్యప్ప స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నాగరాజు, మాళికాపురత్తమ్మ దేవీల విగ్రహ మరియు ధ్వజ స్థంభ ప్రతిష్ఠా మహోత్సవంలు, మహాపడి పూజా కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం జలాధివాసం నిర్వహించనున్నారు. ఉదయం ప్రతిష్ఠా విగ్రహాలను చండూరు పొలిమేర నుంచి పుర వీధుల గుండా భారీ ఊరేగింపు చేయనున్నారు. కేరళ వాయిద్యాలతో కోలాటాల నడుమ నభూతో నభవిష్యత్తుగా సాగనుంది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. జలాధివాసానికి భక్తులు ప్రతి ఇంటి నుంచి ఒక బిందెడు నీళ్లు తేనున్నారు. 15న క్షీరాధివాసము, ధాన్యాధివాసము, ఫలపుష్ప, శయ్యాధివాసములు నిర్వహిస్తారు. ధాన్యాధివాసానికి ఉదయం 10 గంటలకు ప్రతి ఇంటి నుంచి భక్తులు శేరుంభావు ఆపై శక్తి మేరకు బియ్యం తేనున్నారు. 16న ఉదయం అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహ, పరివార దేవతలు మరియు యంత్ర ప్రతిష్ఠాపనములు జరపబడును. ప్రతిష్ఠా మహోత్సవం జరుగు 14,15,16 తేదిలలో మధ్యాహ్నం వేళలో పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేపడుతున్నారు. 18న దేవాలయ పదునెట్టాంబడికి మహాపడి పూజా కార్యక్రమమును నిర్వహించనున్నారు. ప్రతిష్ఠాపన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి-లక్ష్మీ దంపతులు హాజరవ్వనున్నారు. ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఇప్పటికే చండూరు పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ఠాపన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు డా.కోడి శ్రీనివాసులు తెలిపారు. విరాళాలు ఇవ్వాలనుకుంటున్న దాతలు 9440481414 కు సంప్రదించాలని తెలిపారు.



ఆధ్యాత్మిక, శుభకార్యాల్లో
పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 13: పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీ జీహెచ్ఎంసీ డివిజన్ పరిధిలో మాద్రి పృథ్వీరాజ్ పలు ఆధ్యాత్మిక, శుభకార్యాల్లో పాల్గొన్నారు. ఆల్విన్ కాలనీలో ఫణీంద్రరెడ్డి ఆధ్వర్యంలో, వెంకట్రావు గురుస్వామి నేతృత్వంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ కాలనీలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్‌లో ఎండీఆర్ యువసేన సభ్యుడు కిరణ్ కుమారుడి మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రజల కుటుంబ శుభకార్యాల్లోనూ పాల్గొంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంతోషాల్లో భాగస్వాములవుతున్న మాద్రి పృథ్వీరాజ్‌ను పలువురు అభినందించారు.

ఈ నెల 16న సంగారెడ్డిలో పిల్లల ప్రజావాణి

పిల్లల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 13: జిల్లాలోని పిల్లల సమస్యలను నేరుగా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 16న సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెగ్యులర్ ప్రజావాణితో పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని మారుమూల గ్రామాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆరోగ్యం, విద్య, పోలీస్, రవాణా, బాలల సంక్షేమం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై పిల్లలు స్వయంగా జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. పిల్లల ప్రజావాణికి వచ్చే చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఎల్పీడీ డెస్కులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు అందించే ప్రతి వినతిపత్రాన్ని నమోదు చేసి, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని లలిత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ రత్నం, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ యాదగిరి పాల్గొన్నారు.

మందమర్రి లో బెల్ట్ షాపులపై పోలీసుల మెరుపు దాడులు

101.5 లీటర్ల మద్యం స్వాధీనం.. నలుగురిపై కేసులు

పదేపదే పట్టుబడితే బైండోవర్ చేస్తాం: సీఐ రమేష్

మందమర్రి, నవంబర్ 13 (క్రైమ్ మిర్రర్): పట్టణంలోని అక్రమ బెల్ట్ షాపులపై పోలీసులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. సీఐ రమేష్ పర్యవేక్షణలో ఎస్సై నరేష్, సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో నాలుగు బెల్ట్ షాపుల్లో రూ.71 వేల విలువైన 101.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మందమర్రి సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపుల నిర్వహణను సహించేది లేదన్నారు. నిర్వాహకులు స్వచ్ఛందంగా షాపులు మూసివేయాలని, పదేపదే పట్టుబడితే కేసులతోపాటు బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాల సమాచారం పోలీసులకు అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఖమ్మంలో ఘనంగా శుభప్రదం షాపింగ్ మాల్ గ్రాండ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రముఖ జబర్దస్త్ కమెడియన్ శ్రీ వర్ష చేతుల మీదుగా ప్రారంభోత్సవం







ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ఖమ్మం నగరంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో శుభప్రదం షాపింగ్ మాల్ ఏర్పాటు చేసిన గ్రాండ్ షాపింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ జబర్దస్త్ కమెడియన్ శ్రీ వర్ష నవంబర్ 13న ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పురుషులు, మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించిన వివిధ రకాల ఆకర్షణీయమైన వస్త్రాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, వినియోగదారులకు అత్యంత తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో శుభప్రదం షాపింగ్ మాల్‌కు ఇది ఆరో బ్రాంచ్ కావడం విశేషమని తెలిపారు.ఖమ్మం నగర ప్రజలకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నవంబర్ 13 నుంచి నవంబర్ 22 వరకు పది రోజుల పాటు ఈ షాపింగ్ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, నగర ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కోదాడ నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ

అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



కోదాడ, నవంబర్ 13: క్రైమ్ మిర్రర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పింఛన్లను కోదాడ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి నలమాద పద్మావతి రెడ్డి గారు పంపిణీ చేశారు.శుక్రవారం కోదాడ పట్టణంలోని ఆర్ఎన్‌వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలు, కోదాడ పట్టణ పరిధికి చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా పింఛన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో చేయూత పింఛన్లను అందిస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు తదితర వర్గాలకు పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.కోదాడ నియోజకవర్గంలో ఇప్పటికే 37,120 మంది లబ్ధిదారులు ప్రతి నెలా పింఛన్లు పొందుతుండగా, సెప్టెంబర్ 2026 నుంచి కొత్తగా మరో 4,674 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లతో మరింత మంది అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతన పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



బీరంగూడలో కేఎస్‌బీ కేఫ్ అండ్ బేకరీ ప్రారంభోత్సవం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 13: పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కేఎస్‌బీ కేఫ్ అండ్ బేకరీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్ శ్రీ ఎడ్ల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార రంగంలో రాణిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. స్థానికంగా నూతన వ్యాపారాల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

మందమర్రిలో అక్రమ బెల్ట్ షాపులపై పోలీసుల ఉక్కుపాదం


బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: సీఐ రమేష్



మందమర్రి టౌన్ నవంబర్ 13 క్రైమ్ మిర్రర్: మందమర్రి పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న నాలుగు బెల్ట్ షాపులను పోలీసులు గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో ఎస్ఐ నరేష్, తమ సిబ్బందితో శుక్రవారం పట్టణంలోని అక్రమ బెల్ట్ షాపులపై మెరుపు దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆయా బెల్ట్ షాపుల నుంచి సుమారు రూ.71 వేల విలువైన 101.5 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేసామని తెలిపారు.మందమర్రి సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలను, బెల్ట్ షాపుల నిర్వహణను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. బెల్ట్ షాపుల కారణంగా గ్రామాలు, కాలనీల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా, అనేక పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారు ఇప్పటికైనా స్వచ్ఛందంగా వాటిని మూసివేయాలని అన్నారు. పదేపదే అక్రమ మద్యం విక్రయిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు బైండోవర్ చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు.సర్కిల్ పరిధిలో ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వారు తెలిపారు.

ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు





అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

జిల్లాలో పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 13: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఈ నెల 19 నుంచి అమల్లోకి రానుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం విధివిధానాలు, అమలు, నమోదు ప్రక్రియ, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలపై సమీక్షించారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

18 నుంచి 59 ఏళ్ల వారికి అర్హత

తెలంగాణ రాష్ట్రంలో జన్మించి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక కేంద్రాలు, నమోదు శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, బీమా ప్రయోజనం పొందే వ్యక్తుల వివరాలు, నామినీల సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అవసరమైన దరఖాస్తు పత్రాలు, నమూనా పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి, అదనపు డీఆర్డీఓ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పండ్లు, దుస్తులు, ఆట వస్తువులు అందజేసిన ఏబిసిడి కిడ్జీ విద్యార్థులు

కోదాడ నవంబర్ 13 క్రైమ్ మిర్రర్ : కోదాడ, నవంబర్ 13: చిన్న వయసులోనే పిల్లల్లో సేవా భావాని మానవత విలువలను పెంపొందించే ఉద్దేశంతో కోదాడ పట్టణంలోని నయా నగర్ ఏబిసిడి కిడ్జీ(ఆదీజణ ఎఱఒఓవవ) పాఠశాల విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపల్ గులామ్. మంజూర్ ఆధ్వర్యంలో నవంబర్ 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా సుమారు 100 మంది చిన్నారులు స్థానిక అశోక్ నగర్ లోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల అనాథాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు తమ వంతు సాయంగా తెచ్చిన బట్టలు, పండ్లు మరియు ఆట వస్తువులను ఆశ్రమంలోని పిల్లలకు స్వయంగా అందజేశారు. ఆశ్రమ వాసులతో కలిసి కొంతసేపు ఆడుతూ, పాడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ... పిల్లలకు చదువుతోపాటు సామాజిక బాధ్యత, తోటి వారికి సాయం చేసే గుణం నేర్పించడం ఎంతో అవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఎస్.కె. రజియా, పి. శిరీష, సిజ్జి కమర్, సుభాశ్రీ నాయక్, పావని, రెహనా, లిప్సా నాయక్, అర్చన నాయక్ ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు చిన్నారులు పాల్గొన్నారు.

దళితబంధం అక్రమాలపై సమాధానం చెప్పాకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించాలి!

రైతుల కష్టాలపై మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవడం మానుకోవాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావెళ్ల కృష్ణారావు ఘాటు వ్యాఖ్యలు

కోదాడ, నవంబర్ 13 (క్రైమ్ మిర్రర్): రైతుల సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవడం మానుకోవాలని, రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ముందు గతంలో అధికారంలో ఉన్న సమయంలో కోదాడ నియోజకవర్గంలో దళితబంధు పథకం అమలులో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు, అవకతవకలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రావెళ్ల కృష్ణారావు మాట్లాడుతూ.. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రజాస్వామ్యంలో తప్పు కాదని, అయితే రైతుల కష్టాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం, ప్రతి సమస్యను ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు అస్త్రంగా మలుచుకోవడం మాజీ ఎమ్మెల్యే స్థాయికి తగదని హితవు పలికారు. రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే గతంలో అధికారంలో ఉన్నప్పుడు రైతుల కోసం ఏం చేశారో, వారి సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రజలకు వివరించాలని అన్నారు. ముఖ్యంగా కోదాడ నియోజకవర్గంలో గతంలో దళితబంధు పథకం అమలు సమయంలో అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందా?




లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం జరిగిందా? అర్హులైన వారిని పక్కనపెట్టి ఇతరులకు ప్రయోజనం కల్పించారా? పథకం అమలులో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకున్నాయి? అనే అంశాలపై మాజీ ఎమ్మెల్యే ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకం అమలులో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు, అవకతవకలు, ఇతర వ్యవహారాలపై బహిరంగ చర్చకు బొల్లం మల్లయ్య యాదవ్ సిద్ధమా? అని రావెళ్ల కృష్ణారావు సవాల్ విసిరారు. గతంలో అధికారంలో ఉండి పాలన సాగించిన వారు తమ హయాంలో జరిగిన పరిణామాలకు సమాధానం చెప్పకుండా, ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర కల్పించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, బోనస్ వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతులకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. అంతేకానీ రైతుల సమస్యలను అడ్డుపెట్టుకుని రాజకీయ విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. గతంలో తమ పాలనలో జరిగిన తప్పిదాలపై సమాధానం చెప్పకుండా ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. ముందుగా దళితబంధు పథకం అమలులో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రజలకు స్పష్టత ఇచ్చిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై మాట్లాడాలని రావెళ్ల కృష్ణారావు సూచించారు. రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని, నాయకులు చేసే ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలను ప్రజలు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 13: ఈ నెల 15న పటాన్‌చెరు సాకి చెరువు వేదికగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఛట్ పూజ మహోత్సవ ఏర్పాట్లను మాద్రి పృథ్వీరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వేదుక జరిగే ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్ల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఛట్ పూజకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వాలంటీర్ల సమన్వయం, భద్రతా చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వేదుక విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట తమ పూర్తి మద్దతు ఉంటుందని భరోసా కల్పించారు. ఈ ఛట్ పూజ మహోత్సవంలో ప్రముఖ భోజ్‌పురి గాయకుడు రితేష్ పాండే, గాయని కావ్య సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భక్తులు, ఉత్తర భారతీయులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం

తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్, మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


ముగిసిన సింగరేణి కంపెనీ స్థాయి క్రికెట్ పోటీలు

విజేతగా శ్రీరాంపూర్ జట్టు.. రన్నరప్‌గా మణుగూరు-ఇల్లందు

విజేతలకు ట్రోఫీలు అందజేసిన మందమర్రి జీఎం ఎన్. రాధాకృష్ణ

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి: జీఎం పిలుపు

రామకృష్ణాపూర్, నవంబర్ 13 (క్రైమ్ మిర్రర్): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన కంపెనీ స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం స్థానిక ఠాగూర్ స్టేడియంలో ముగిశాయి. మూడు రోజులపాటు ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విజేతగా నిలవగా, మణుగూరు-ఇల్లందు సంయుక్త జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. సింగరేణి అభివృద్ధికి ప్రతి ఉద్యోగి ఐక్యంగా కృషి చేయాలని, క్రీడల్లో చూపే తపనను రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనలోనూ ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. భద్రతా నియమాలు పాటిస్తూ సంస్థను లాభాల బాటలో నడిపించాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాబోయే కోల్ ఇండియా స్థాయి పోటీల్లోనూ రాణించి సంస్థకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, ఏఐటీయూసీ నాయకులు ఇప్పకాయల లింగయ్య, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు సీహెచ్. అశోక్, ఎం. నరేందర్ రెడ్డి, పరస్స శ్రీనివాస్, మందమర్రి ఏరియా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివ, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 శనివారం 14-11-2026



నాగుల చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

భక్తిశ్రద్ధలతో తమ్మరబండపాలెంలో నాగుల చవితి 40వ వార్షికోత్సవ వేడుకలు



కోదాడ, నవంబర్ 13 (క్రైమ్ మిర్రర్): నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరబండపాలెం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన నాగుల చవితి 40వ వార్షికోత్సవ వేడుకల్లో కోదాడ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి దివ్య ఆశీస్సులు కోదాడ పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, నియోజకవర్గం పాడిపంటలతో కళకళలాడుతూ సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ బద్ధంగా నాగుల చవితి 40వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోదాటి కృష్ణయ్య, కనగాల శ్రీధర్, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ బొల్లు సాయి, గోరేమియా, సతీష్, మస్తాన్, గుర్రాల సాయి, రవి, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిహెచ్ఎంసి 60వ డివిజన్ మీర్పేట్ లోని తిరుమల నగర్ కాలనీలో హరిహర క్షేత్రం దగ్గర ఉమా శ్రీ ఉమామహేశ్వర దేవాలయ మహా కుంభాభిషేక మహోత్సవం ధ్వజస్తంభ ప్రతిష్టాప కార్యక్రమం ఉజ్జయిని పీఠాధిపతుల చేతులమీదుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విచ్చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ మాజీ ఎంపీటీసీ ఏనుగుల అనిత అనిల్ యాదవ్ మాజీ కార్పొరేటర్ బోయపల్లి శేఖర్ రెడ్డి మాజీ టెంపుల్ డైరెక్టర్ మేకల యాదగిరి, కంటెస్టెడ్ కార్పొరేటర్ అబ్బనమోని గోపి యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు కాశీనాథ్, ప్రభులింగం, నాగ ఫణీంద్ర కుమార్, గేదెల సాయి మరియు అధిక సంఖ్యలో శివ భక్తులు పాల్గొనడం జరిగింది.

రౌడీషీటర్‌కు నగర బహిష్కరణ నోటీసు

శ్రీరాంపూర్, నవంబర్ 13 (క్రైమ్ మిర్రర్) : రౌడీషీట్ ఉన్నా ప్రవర్తన మార్చుకోకుండా వరుస నేరాలకు పాల్పడుతున్న జలంపల్లి సందీప్ (20)కు శ్రీరాంపూర్ పోలీసులు నగర బహిష్కరణ నోటీసులు జారీ చేశారు. అరుణక్క నగర్‌కు చెందిన సందీప్ 2023 నుంచి 2026 వరకు పలు నేర కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాలు, మంచిర్యాల డీసీపీ, ఏసీపీ సూచనల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే ఎంతటివారిపైనైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల కొరడా

వరుసగా రెండు రోజుల పాటు కూల్చివేతలు

ప్రభుత్వ భూముల స్వాధీనం

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఎమ్మార్వో వెంకటేశం





అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 13: ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు ముమ్మరం చేశారు. వరుసగా రెండు రోజుల పాటు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, బేస్‌మెంట్లను జేసీబీల సహాయంతో కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి భూములను స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టారు. గురువారం నవంబర్ 12న అమీన్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 991, 630, 1042లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గుర్తించి తొలగించారు. ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి కూల్చివేతలు చేపట్టారు. శుక్రవారం నవంబర్ 13న కూడా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. నర్రెగూడెం, ఐలాపూర్ తండా, ఐలాపూర్ విలేజ్ పరిధిలో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్లను జేసీబీలతో తొలగించారు. అమీన్‌పూర్ గ్రామ పరిధిలోని నర్రెగూడెం సర్వే నంబర్ 1112లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. అమీన్‌పూర్ ఎమ్మార్వో వెంకటేశం ఆదేశాల మేరకు జీపీఓ కార్తీక్, ఆర్ఐ సంగీత, మల్లికార్జున్, సిఎంసి అధికారుల సహకారంతో కూల్చివేతలు నిర్వహించారు. పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీలతో ఆక్రమణలను తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

అమీన్‌పూర్ మండల పరిధిలో భూముల విలువలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ భూములు, చెరువుల పరిసర ప్రాంతాలు, ఖాళీ స్థలాల ఆక్రమణలపై తరచూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములను గుర్తించి పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగిన కూల్చివేతలతో ప్రభుత్వ భూముల ఆక్రమణల అంశం మరోసారి చర్చనీయాంశమైంది. స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేసి, భవిష్యత్తులో తిరిగి ఆక్రమణలకు గురికాకుండా శాశ్వత రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించి తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మహిళా నేతలపై అసభ్య వ్యాఖ్యలు

వైఎస్సార్సీపీ నేతలపై కించపరిచేలా మాట్లాడిన వారిపై ఫిర్యాదు..

పలువురి పేర్లతో పోలీసులకు ఫిర్యాదు చేసిన శ్యామలారెడ్డి

వీడియో రికార్డింగులు, పెన్‌డ్రైవ్ సమర్పణ..

చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



గండిపేట(క్రైమ్ మిర్రర్): సోషల్ మీడియా వేదికగా రాజకీయ విమర్శల పేరుతో మహిళా నేతలపై అసభ్యకర, అశ్లీల, లైంగికపరమైన వ్యాఖ్యలు చేశారంటూ పలువురిపై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు అందింది. ముఖ్యంగా వైఎస్సార్సీపీ పార్టీ, ఆ పార్టీ నాయకులు, మహిళా నేతలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో నిర్వహించిన పబ్లిక్ బ్రాడ్‌కాస్ట్, గ్రూప్ చర్చలో పలువురు వ్యక్తులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని శ్యామలారెడ్డి నార్సింగి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. లక్ష్మీ నరసింహారెడ్డి భార్య శ్యామలారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. గోవాడ రాఘవేంద్ర నాయుడు (హోస్ట్), మానియాక్ నాయుడు, ప్రుధ్వివిబిఓజీ (కో-హోస్టులు), గుంటూరు జిల్లా పెద్దకాకానికి చెందిన ప్రుధ్వి, కృష్ణ, కిరణ్, ఓజీ45, 12 రెప్స్, కోబాలి, మున్నా, 11 రెడ్డి తదితర స్పీకర్లతో పాటు ఏటైసన్21ఏపీ, ఏవెర్టీ 1234అప్, ఏగ్లాస్19మార్ అనే ఎక్స్ ఖాతాల నిర్వాహకులపై ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా చర్చ సందర్భంగా వైఎస్సార్సీపీ పార్టీపై, ఆ పార్టీ నాయకులపై, ముఖ్యంగా మహిళా నేతలపై అసభ్యకరమైన, అశ్లీలమైన, లైంగికపరమైన వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైఎస్ భారతి సహా మహిళా నాయకులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని వారి గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా అవమానకర వ్యాఖ్యలు, సంజ్ఞలు, అభ్యంతరకర వ్యక్తీకరణలకు పాల్పడ్డారని ఆరోపించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల విడాకుల వ్యవహారంపై వ్యాఖ్యానించే నెపంతో వైఎస్ భారతితో పాటు ఇతర మహిళా నేతలపై వ్యక్తిగత, లైంగికపరమైన దూషణలకు దిగారని ఫిర్యాదుదారు ఆరోపించారు. రాజకీయ విమర్శలకు అతీతంగా మహిళల వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక నిర్దిష్ట కులం, సామాజిక వర్గాన్ని ఉద్దేశించి రెచ్చగొట్టే, అవమానకర వ్యాఖ్యలు చేశారని, వాటివల్ల వివిధ వర్గాల మధ్య విద్వేషాలు, విభేదాలు పెరిగి సామాజిక సామరస్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రూప్ చర్చ బహిరంగంగా పెద్ద సంఖ్యలో ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు, పాల్గొన్న వ్యక్తులు ఒకరి వ్యాఖ్యలను మరొకరు ప్రోత్సహిస్తూ అభ్యంతరకరమైన సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీయడం, వారిని అవమానించడం, భయభ్రాంతులకు గురిచేయడం ఈ వ్యాఖ్యల వెనుక ఉద్దేశమని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలోని వివిధ వర్గాల మధ్య పరస్పర విద్వేషాలకు దారితీసి, ప్రతీకార చర్యలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని శ్యామలారెడ్డి తన ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో రికార్డింగులను భద్రపరిచి, వాటిని పెన్‌డ్రైవ్‌లో పోలీసులకు సమర్పించినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు అభ్యంతరకర కంటెంట్‌ను ప్రచారం చేసిన ఇతర వ్యక్తులను కూడా గుర్తించి, విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.



చేతికొచ్చిన వరి పంటను కాపాడండి..

న్యాయం చేయండి

పంట కోతకు అడ్డంకులు సృష్టిస్తున్నారని రైతు కుటుంబం ఆవేదన

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం కురుమిద్ద గ్రామ శివారులో వరి పంట కోత విషయంలో వివాదం చోటుచేసుకుంది. తమ వ్యవసాయ పొలంలో సాగు చేసిన వరి పంట కోతకు సిద్ధమైనప్పటికీ, పంటను కోసేందుకు వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారని రైతు లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి కోతకు వచ్చిన నేపథ్యంలో లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు కోత యంత్రంతో పొలానికి వెళ్లేందుకు ప్రయత్నించగా, తమ పొలం మీదుగా యంత్రాన్ని రానిచ్చేది లేదని, పంట కోయనివ్వబోమని కొందరు అడ్డుకున్నారని బాధితులు ఆరోపించారు. అంతేకాకుండా తమపై దాడికి ప్రయత్నించారని, కుల సంఘం నాయకుడి ప్రోద్బలంతో కొందరు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ వ్యవహారంపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రత్యర్థుల ఒత్తిడికి అధికారులు స్పందిస్తున్నారే తప్ప, కోతకు సిద్ధంగా ఉన్న తమ వరి పంట నేలపాలవుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంటను కాపాడి న్యాయం చేయాలని కోరుతూ కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బాధిత కుటుంబ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. అనంతరం తమ సమస్యను పరిష్కరించి, వరి పంట కోతకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.

ఫెన్సింగ్ ఏరియా కాలనీలో విద్యుత్ సమస్యకు పరిష్కార చర్యలు

నివాసితులకు ఇబ్బందులు కలగకుండా పెద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కాలనీలో పర్యటించిన సింధు ఆదర్శ్ రెడ్డి



పటాన్‌చెరు, నవంబర్ 13: భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఫెన్సింగ్ ఏరియా కాలనీలో నెలకొన్న విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కారానికి బీఆర్ఎస్ నాయకులు చర్యలు చేపట్టారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను పరిశీలించారు. కాలనీలోని ఇళ్లకు ఆనుకుని ఉన్న చిన్న విద్యుత్ స్తంభాల వల్ల నివాసితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈఈ నాగరాజు, ఏఈ తిరుపతమ్మ, కాంట్రాక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు.చిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో పెద్ద స్తంభాలను ఏర్పాటు చేసి, భవిష్యత్తులో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, నరసింహా, జైపాల్, కొండల్, జాకీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 14-11-2026
7

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు

ఛట్ పూజ సందర్భంగా 50 వేల మందికి 10 లారీల చెరుకు పంపిణీ





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 13: భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్‌చెరు నియోజకవర్గం నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజ పండుగను పురస్కరించుకొని శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సుమారు 50 వేల మంది ఉత్తర భారతీయులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన సొంత నిధులతో కొనుగోలు చేసిన 10 లారీల చెరుకును పంపిణీ చేశారు. పటాన్‌చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం, అమీన్‌పూర్, గుమ్మడిదల, బొంతపల్లి, ఖాజీపల్లి తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉత్తర భారతీయులకు చెరుకును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఉపాధి కోసం పటాన్‌చెరు నియోజకవర్గంలోని పరిశ్రమల్లో పనిచేస్తూ ఇక్కడే నివాసం ఉంటున్నారని తెలిపారు. వారందరి సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోనూ ఉత్తర భారతీయులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పారు. గత 20 సంవత్సరాలుగా పటాన్‌చెరు సాకి చెరువు కట్టపై నిర్వహించే ఛట్ పూజ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ ఉత్తర భారతీయులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకటేష్, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఇన్ముల్నర్వ లేఅవుట్ ఈ-వేలానికి భారీ స్పందన


45 నివాస ప్లాట్ల విక్రయానికి హెచ్ఎండీఏ ప్రీ-బిడ్ సమావేశం..

బిడ్డర్ల సందేహాలకు అధికారుల సమాధానాలు

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): ఇన్ముల్నర్వ లేఅవుట్‌లోని 45 నివాస ప్లాట్ల ఈ-వేలం నిర్వహణకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) శుక్రవారం నిర్వహించిన ప్రీ-బిడ్ సమావేశానికి ఔత్సాహిక బిడ్డర్ల నుంచి విశేష స్పందన లభించింది. ఈ-వేలంలో పాల్గొనాలనే ఆసక్తితో పలువురు సమావేశానికి హాజరై లేఅవుట్ వివరాలు, మౌలిక సదుపాయాలు, బిడ్డింగ్ విధానాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ అధికారులు ఈఈ దన్మోహన్ సింగ్, తహసీల్దార్ వై.టి. వెంకటేశ్వర్లు, డీఈఈ అభిలాష్, ఏఈఈ శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ లావాదేవీల సలహాదారు సంస్థ కేపీఎంజీ ప్రతినిధి కల్యాణ్ ఇన్ముల్నర్వ లేఅవుట్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. లేఅవుట్‌కు ఉన్న రవాణా అనుసంధానం, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరించారు. అదేవిధంగా ఎంఎస్‌టీసీ లిమిటెడ్ ప్రతినిధి దినేష్ ఈ-వేలంలో పాల్గొనేందుకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బిడ్డింగ్ విధివిధానాలు, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ-వేలంలో పాల్గొనడానికి ఆసక్తి చూపుతున్న వారు బిడ్డింగ్ ప్రక్రియ, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), చెల్లింపుల నిబంధనలు, అభివృద్ధి ప్రమాణాలు తదితర అంశాలపై పలు సందేహాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటికి హెచ్ఎండీఏ అధికారులు సమగ్రంగా సమాధానాలు ఇచ్చి, వేలంలో పాల్గొనే విధానాన్ని వివరించారు. ఇన్ముల్నర్వ లేఅవుట్‌లోని 45 నివాస ప్లాట్లకు సంబంధించి ఈ-వేలం ప్రక్రియను నవంబర్ 23న నిర్వహించనున్నట్లు హెచ్ఎండీఏ వెల్లడించింది. ఆసక్తి గల బిడ్డర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు. మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం హెచ్ఎండీఏ హెల్ప్‌లైన్ నంబర్ 7416835522ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. ఈ-వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనలు, పాల్గొనే విధానం కోసం హెచ్ఎండీఏ అధికారిక వెబ్‌సైట్ ఽఽఽ.ష్ట్రఎఽఽ.స్ట్రశీఅ.అఅను సందర్శించాలని తెలిపారు. ప్రీ-బిడ్ సమావేశానికి లభించిన స్పందన నేపథ్యంలో రానున్న ఈ-వేలంలో మరింత మంది బిడ్డర్లు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

పర్యావరణహిత నిర్మాణ పద్ధతులపై సీబీఐటీ విద్యార్థులకు అవగాహన

ఎన్ఐఆర్‌డీపీఆర్‌ను సందర్శించిన 135 మంది సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ తక్కువ ఖర్చుతో, నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టే ఆధునిక సాంకేతిక పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో గండిపేటలోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) విద్యార్థులు రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)ను సందర్శించారు. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కోర్సులో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఈ విద్యా పర్యటనలో సీబీఐటీకి చెందిన బి.ఈ. సివిల్ ఇంజినీరింగ్ మొదటి సెమిస్టర్‌కు చెందిన మొత్తం 135 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగపడే వినూత్న, పర్యావరణహిత, తక్కువ వ్యయంతో కూడిన నిర్మాణ సాంకేతికతలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా విద్యార్థులకు సుస్థిర నిర్మాణ పద్ధతులు, పర్యావరణానికి అనుకూలమైన నిర్మాణ సామగ్రి, స్థానికంగా లభించే వనరులతో తక్కువ ఖర్చుతో నిర్మాణాలు చేపట్టే విధానాలపై అవగాహన కల్పించారు. నిర్మాణ రంగంలో సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, అందుబాటులో ఉన్న స్థానిక నిర్మాణ సామగ్రితో నాణ్యమైన గృహాలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలను వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణ సౌకర్యాలు కల్పించడంలో పర్యావరణహిత నిర్మాణ సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తాయని విద్యార్థులకు తెలియజేశారు. తక్కువ వ్యయంతో పాటు మన్నిక, నాణ్యత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యతనిస్తూ నిర్మాణ రంగంలో కొత్త ఆవిష్కరణలు చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థులకు తరగతి గదుల్లో నేర్చుకున్న సివిల్ ఇంజినీరింగ్ అంశాలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకునే అవకాశం లభించింది. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, గృహాలు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో సివిల్ ఇంజినీర్లు పోషించాల్సిన బాధ్యతను ఈ విద్యా పర్యటన తెలియజేసింది. ఈ కార్యక్రమాన్ని సీబీఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. జగన్నాథరావు మార్గదర్శకత్వంలో నిర్వహించారు. అధ్యాపక సమన్వయకర్తలుగా డాక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఈ. మహేష్ రెడ్డి, డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ విశాల్ సింగ్, డాక్టర్ శ్రీకాంత్ కోనికి వ్యవహరించారు. ఈ విద్యా పర్యటన విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన అధ్యాపక సమన్వయకర్తలను సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. జగన్నాథరావు అభినందించారు. విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విలువైన పరిజ్ఞానాన్ని సంపాదించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇటువంటి క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని భవిష్యత్తులో సద్వినియోగం చేసుకోవాలని, సమాజానికి ఉపయోగపడే వినూత్నమైన, పర్యావరణహితమైన, తక్కువ ఖర్చుతో కూడిన ఇంజినీరింగ్ పరిష్కారాలను అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. మొత్తంగా ఈ విద్యా పర్యటన సీబీఐటీ విద్యార్థులకు ఒక విలువైన అభ్యసన అనుభవంగా నిలిచింది. గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికంగా అందుబాటులో ఉండే మౌలిక సదుపాయాల కల్పనలో సుస్థిర నిర్మాణ సాంకేతికతల ప్రాముఖ్యతను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది.

ఛట్ పూజకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ఆహ్వానం

రాజేంద్రనగర్‌లో ఈ నెల 15న ఘనంగా ఛట్ పూజ వేడుకలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఈ నెల 15వ తేదీన రాజేంద్రనగర్‌లో నిర్వహించనున్న ఛట్ పూజ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ స్థానిక నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేస్తూ, ఛట్ పూజ వేడుకల్లో పాల్గొని భక్తులను ఆశీర్వదించాలని కోరారు. ఉత్తర భారతీయుల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఛట్ పూజను రాజేంద్రనగర్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పడమటి శ్రీధర్ రెడ్డి, స్థానిక నాయకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మధుమేహంపై అవగాహన అవసరం



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబరు 13: చిన్న వయసులోనే మధుమేహం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ టి.సతీష్ విద్యార్థులకు సూచించారు. మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మిర్యాలగూడ లయన్స్ క్లబ్ భాస్కర క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ.. మధుమేహం రావడానికి గల కారణాలు, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. చిన్నతనం నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో అనారోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులు, ఇంట్లోని పెద్దలు, చుట్టుపక్కల వారికి తెలియజేసి వారిలోనూ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏచూరు మురారి, భాగ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ భూముల ఈ-వేలం ప్రీ-బిడ్ సమావేశం తేదీలో మార్పు

నవంబర్ 18కు బదులుగా 17న సమావేశం..

పరిపాలనా కారణాలతో ఒక రోజు ముందుకు మార్చిన హెచ్ఎండీఏ

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లోని భూముల ప్లాట్ల విక్రయానికి నిర్వహించనున్న ఈ-వేలం ప్రక్రియలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఈ-వేలానికి సంబంధించి నిర్వహించాల్సిన ప్రీ-బిడ్ సమావేశం తేదీని ఒక రోజు ముందుకు మారుస్తూ హెచ్ఎండీఏ నిర్ణయం తీసుకుంది. తొలుత నవంబర్ 18న నిర్వహించాలని నిర్ణయించిన సమావేశాన్ని తాజాగా నవంబర్ 17న నిర్వహించనున్నట్లు ప్రకటించింది. హెచ్ఎండీఏ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ద్వారా అక్టోబర్ 24, 2026న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని మూడు కీలక ప్రాంతాల్లో ఉన్న భూముల ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేపట్టింది. హెచ్‌యూడీఏ హైట్స్ లేఅవుట్: హైదరాబాద్ జిల్లా శేరిలింగంపల్లి మండలం, హుడా కాంప్లెక్స్ గ్రామంలోని సర్వే నంబర్ 102/1లో ఉన్న భూమి, నియోపోలిస్ లేఅవుట్: రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం, కోకాపేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 239, 240లో ఉన్న ప్లాట్ నంబర్ 17, మూసాపేట్ భూమి: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలం, మూసాపేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 121/ూ నుంచి 141 వరకు, 146, 147, 155 నుంచి 157 వరకు ఉన్న ప్లాట్ నంబర్ 1, పరిపాలనా కారణాల దృష్ట్యా ప్రీ-బిడ్ సమావేశాన్ని నవంబర్ 18కు బదులుగా నవంబర్ 17న నిర్వహించాలని నిర్ణయించినట్లు హెచ్ఎండీఏ వెల్లడించింది. ఈ-వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న బిడ్డర్లు సవరించిన తేదీని గమనించి, ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది.

ఈ-వేలం షెడ్యూల్‌లో మార్పు లేదు

అయితే బిడ్డర్లు ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ తేదీ మార్పు కేవలం ప్రీ-బిడ్ సమావేశానికి మాత్రమే పరిమితం. ఈ-వేలం నిర్వహణ తేదీలు, బిడ్డర్ల రిజిస్ట్రేషన్, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చెల్లింపునకు సంబంధించిన చివరి తేదీలు, కనీస బిడ్ పెంపు మొత్తం, ఇతర నిబంధనలు, షరతుల్లో ఎలాంటి మార్పు లేదని హెచ్ఎండీఏ స్పష్టం చేసింది. అందువల్ల ఈ-వేలంలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు సవరించిన ప్రీ-బిడ్ సమావేశ తేదీని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని, మిగిలిన ఈ-వేలం నిబంధనలను యథావిధిగా అనుసరించాలని అధికారులు సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై శంషాబాద్ ట్రాఫిక్ పోలీసుల కొరడా

ట్రాఫిక్ నేరాలపై కఠిన చర్యలు..

రూ.38,700 జరిమానా, ముగ్గురికి జైలు శిక్ష, సమాజ సేవ



గండిపేట(క్రైమ్ మిర్రర్): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపే వారిపై శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని ఉపేక్షించేది లేదని శంషాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నవంబర్ 3న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ ఉల్లంఘన కేసులను న్యాయస్థానం ద్వారా పరిష్కరించి మొత్తం రూ.38,700 జరిమానా విధించారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కు సంబంధించిన కేసుల్లో ముగ్గురిపై న్యాయస్థానం కఠిన చర్యలు తీసుకుంది. రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ఎదుట నిందితులను హాజరుపరచగా, ఎస్. వేణుకు ఒక రోజు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించారు. బి. గోపి, టి. భరత్ కుమార్‌లకు ఒక్కొక్కరికి ఒక రోజు సమాజ సేవతో పాటు రూ.2,500 చొప్పున జరిమానా విధించారు. ఇక మిగిలిన డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసుల్లో జరిమానాలు విధించగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన రెండు కేసుల్లో రూ.3,200 జరిమానా విధించారు. మొత్తంగా 16 ట్రాఫిక్ ఉల్లంఘన కేసుల పరిష్కారం ద్వారా రూ.38,700 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారుల ప్రాణాలకే కాకుండా రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణే లక్ష్యంగా తనిఖీలు మరింత కఠినతరం చేస్తామని శంషాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ తెలిపారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, తమతో పాటు ఇతరుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 | శనివారం | 14-11-2026

సైబరాబాద్ పరిధిలో 10 రోజుల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

నార్సింగి సర్కిల్‌లో చెత్త కుప్పల తొలగింపు.. మణికొండలో క్షేత్రస్థాయి తనిఖీలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరిచి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో కమిషనర్ ఆదేశాల మేరకు 10 రోజుల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు నార్సింగి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడం, ఖాళీ స్థలాల్లో (ఓపెన్ ప్లాట్స్) నిల్వ ఉన్న వ్యర్థాలను శుభ్రం చేయడం, చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపట్టడం వంటి పనులు నిర్వహించారు. సేకరించిన చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో తరలించి, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్లాట్ల యజమానులకు అధికారులు సూచించారు. తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఇతరులు చెత్త వేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసన, దోమల వ్యాప్తి, అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ అదనపు కమిషనర్



(శానిటేషన్), డిప్యూటీ కమిషనర్ మణికొండ పరిధిలోని వివిధ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త నిర్వహణ, ఖాళీ స్థలాల పరిశుభ్రత, వ్యర్థాల తరలింపు విధానాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని, చెత్త పేరుకుపోయే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సక్రమంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు,



పరిసరాలు, ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రానున్న పది రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిరంతరాయంగా కొనసాగిస్తూ కార్పొరేషన్ పరిధిలో పరిశుభ్రతను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

తుమ్మిడికుంట తరహాలో పీరంచెరువును అభివృద్ధి చేయాలి

హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు నల్లగొప్పుల హరిష్ గౌడ్ విజ్ఞప్తి



గండిపేట(క్రైమ్ మిర్రర్): హైదరాబాద్ నగరంలో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించబడిన నల్లచెరువు, సున్నం చెరువు, తుమ్మిడికుంట తరహాలోనే రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హైదర్షాకోట్ పీరంచెరువును కూడా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నల్లగొప్పుల హరిష్ గౌడ్ హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కమిషనర్‌ను కలిసి పీరంచెరువు ప్రస్తుత పరిస్థితులను వివరించి, చెరువు పునరుద్ధరణకు సంబంధించి వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ 123వ డివిజన్ పరిధిలో ఉన్న పీరంచెరువులోకి మురుగునీరు చేరడంతో చెరువు కలుషితమై తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, దీంతో చుట్టుపక్కల నివసించే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకప్పుడు ప్రకృతి అందాలతో, నీటి వనరుగా స్థానికులకు ఉపయోగపడిన పీరంచెరువు ప్రస్తుతం మురుగునీరు, వ్యర్థాలతో కాలుష్య కోరల్లో చిక్కుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చెరువు భూములు ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పీరంచెరువులో పేరుకుపోయిన మురుగునీరు, చెత్తాచెదారాన్ని పూర్తిస్థాయిలో తొలగించాలని, చెరువులో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని హరిష్ గౌడ్ కోరారు. చెరువు పరిధిలో ఉన్న ఆక్రమణలను గుర్తించి అడ్డుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కేవలం చెరువులోని వ్యర్థాలను తొలగించడమే కాకుండా, తుమ్మిడికుంట తరహాలో పీరంచెరువును సమగ్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పచ్చదనంతో కూడిన పార్కులు, మొక్కల పెంపకం, ప్రజలు సేదతీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందడంతో పాటు, ప్రాంతంలో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. హరిష్ గౌడ్ చేసిన విజ్ఞప్తిపై హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే పీరంచెరువును స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తామని, అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు చెరువు అభివృద్ధికి కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. పీరంచెరువు పునరుద్ధరణతో హైదర్షాకోట్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన పర్యావరణం, ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని హరిష్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. చెరువుల పరిరక్షణ భవిష్యత్ తరాల ఆరోగ్యకరమైన జీవనానికి ఎంతో అవసరమని, పీరంచెరువును కూడా నగరంలోని ఆదర్శ చెరువుల సరసన నిలిపేందుకు హైడ్రా అధికారులు చొరవ చూపాలని కోరారు.

పందెన్వాగులో మురుగునీటి కుళ్లుకంపు.. పంట కాలువ పరిరక్షణకు సమితి పోరాటం

గండిపేట(క్రైమ్ మిర్రర్): ఒకప్పుడు వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడిన పందెన్వాగు (పంట కాలువ) నేడు మురుగునీటి ప్రవాహంతో కలుషితమవుతూ దుర్వాసన వెదజల్లుతోందని పందెన్వాగు (పంట కాలువ) పరిరక్షణ సమితి ఆందోళన వ్యక్తం చేసింది. మణికొండ పరిధిలో పందెన్వాగు పరిరక్షణపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని, వర్షపు నీటి పారుదల పేరుతో మురుగునీటిని కాలువలోకి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమితి ప్రతినిధులు ఆరోపించారు. మణికొండ ప్రాంతంలో గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్వహణలోని లోపాలు పందెన్వాగు ప్రస్తుత దుస్థితికి కారణమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికార పార్టీ నాయకుల సూచనలకు అనుగుణంగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు చేస్తూ, ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా పైప్‌లైన్ పనులు చేపట్టేందుకు ప్రయత్నించడం ఆందోళనకరమని తెలిపారు. వర్షపు నీటి పారుదల కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతూ, వాస్తవానికి మురుగునీరు ప్రవహించేలా ప్రణాళిక రూపొందించారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో గతంలో పనులను నిలిపివేయాల్సి వచ్చిందని సమితి ప్రతినిధులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యల నివేదిక అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పందెన్వాగు పరిరక్షణ సమితి తరఫున 2న గ్రీవెన్స్ నంబర్ 211266230618, 9న గ్రీవెన్స్ నంబర్ 911266247598 ద్వారా ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. అయితే ఆయా



ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యల వివరాలను లిఖితపూర్వకంగా అందించకపోవడంతో తాజాగా మరోసారి లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును పందెన్వాగు (పంట కాలువ) పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, నిర్వహణ కార్యదర్శి శంకర్ సమర్పించారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం మురుగునీటి పారుదల వ్యవస్థ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ వేర్వేరుగా ఉండాలని సమితి ప్రతినిధులు గుర్తుచేశారు. ఈ రెండు వ్యవస్థలను కలిపి నిర్వహించడం వల్ల పర్యావరణానికి, జలవనరులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువలోకి మురుగునీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను వెలికితీసేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కూడిన స్వతంత్ర సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేయాలని సమితి డిమాండ్ చేసింది. ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు, ఆమోదించిన డ్రాయింగ్‌లు, అంచనా వ్యయం, టెండర్ వివరాలు, కాంట్రాక్టర్ వివరాలను పరిశీలించాలని కోరింది. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీ నిర్వహించి, పైప్‌లైన్ ద్వారా వెళ్లే నీటి స్వరూపం, దాని గమ్యస్థానం, పందెన్వాగుపై పడే పర్యావరణ ప్రభావాలను అంచనా వేసి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేసింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 127వ మణికొండ డివిజన్‌లో డ్రీమ్ వ్యాలీ నుంచి పందెన్వాగు వరకు ప్రతిపాదించిన పైప్‌లైన్ పనులను స్వతంత్ర సాంకేతిక బృందం విచారణ పూర్తిచేసి నివేదిక వెల్లడించే వరకు నిలిపివేయాలని పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని కోరింది. తమ డిమాండ్లను పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తే ప్రజా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సమితి ప్రతినిధులు హెచ్చరించారు. అవసరమైతే న్యాయపోరాటంలో భాగంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్తామని స్పష్టం చేశారు. పందెన్వాగు పరిరక్షణ కోసం స్థానిక ప్రజలు చేస్తున్న పోరాటానికి అధికారులు స్పందించి, కాలువను మురుగునీటి నుంచి కాపాడేందుకు పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని సమితి నాయకులు కోరుతున్నారు.

నిరసన కార్యక్రమాలు లేకున్నా బలవంతంగా

పోలీస్‌స్టేషన్‌కు తరలించారు

హైకమిటీ విచారణకు సహకరిస్తామని తెలిపినా పోలీసుల తీరుపై బాధితుల ఆవేదన





గండిపేట(క్రైమ్ మిర్రర్): రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ఐఏఎస్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపడుతున్న నేపథ్యంలో, ఎలాంటి నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వకుండా తమ రోజువారీ కార్యకలాపాలకు వెళ్తున్న తమను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ఐఏఎస్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ కమిటీ ఆధ్వర్యంలో నేడు విచారణ జరుగుతోందని తెలిపారు. విచారణలో భాగంగా బాధితురాలు కమిటీ ఎదుట హాజరుకావాలని కూడా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఉన్నతస్థాయి కమిటీపై తమకు గౌరవం ఉందని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశం తమకు లేదని తెలిపారు. అయినప్పటికీ, తాము తమ వీధిలోకి వెళ్లేందుకు, అలాగే పరిశోధన కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న సమయంలో పోలీసులు తమ పట్ల ఏమాత్రం కనికరం చూపకుండా బలవంతంగా పట్టుకుని పోలీసు జీపులో ఎక్కించారని ఆరోపించారు. అనంతరం పంచమ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉన్నతస్థాయి కమిటీ విచారణకు సహకరిస్తామని చెబుతున్నప్పటికీ, మరోవైపు తమను ఇలా బలవంతంగా అదుపులోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని బాధితులు ప్రశ్నించారు. తమపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన

గండిపేట(క్రైమ్ మిర్రర్): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం మై హోమ్ అవతార్ సిగ్నల్ జంక్షన్ వద్ద ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓర్టస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు, ఐదో తరగతి, ఏడో తరగతులకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన ఆకర్షణీయమైన ప్లకార్డులను చేతబట్టి జంక్షన్ వద్ద వాహనదారులు, ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోండి, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించండి, అతివేగం ప్రమాదకరం వంటి సందేశాలతో వాహనదారులను చైతన్యపరిచారు. అనంతరం నార్సింగి ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత ప్రాముఖ్యత, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకత, కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు



ట్రాఫిక్ నిబంధనలను పాటించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని తెలిపారు. చిన్నతనం నుంచే పిల్లల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందిం చడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. బాలల దినోత్సవం వేడుకలను కేవలం వినోద కార్యక్రమా లకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. విద్యార్థులు నేర్చుకున్న ట్రాఫిక్ నియమాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేయాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఇన్‌స్పెక్టర్ అంజనేయులు, ఎస్ఐ రాజేష్ గౌడ్, పోలీస్ కానిస్టేబుల్ రహీమ్, హోంగార్డు వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



దాడి నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట దళిత సంఘాల ధర్నా

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబర్ 13 : దళిత యువకుడిపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాధితుడు దైద సత్యం, దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య వ్యాపారి షరాబు జగదీష్, ఆయన భార్య, కుమారుడు, స్నేహితులు, కార్మికులు కలిపి సుమారు 15 మంది తమ ఇంటిపై దాడి చేశారని ఆరోపించారు. దీపావళి పండుగ రోజున భారీ శబ్దాలు వచ్చే బాంబులు కాల్చవద్దని చెప్పినందుకే తన కుమారుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు తాళ్లపల్లి రవి, బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, మాజీ ఎంపీపీ కె.జానయ్య, కేవీపీఎస్ నాయకులు రేమిడాల పరశురాములు, కోడిరెక్క మల్లయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మొండికత్తి లింగయ్య, మచ్చ ఏడుకొండలు, సురేందర్, బీఆర్ఎస్ నాయకుడు ఐల వెంకన్న, బీఎస్పీ, డీఎస్పీ నాయకులు దినేష్, తరి ఎల్లయ్య, మజ్లిస్ జిల్లా సంయుక్త కార్యదర్శి సయ్యద్ ఫారుఖ్, ముస్లిం మైనారిటీ నాయకుడు ఎండీ ఖాజా, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అహ్మద్‌ఖాన్, బీఎల్ఎఫ్ నాయకులు పి.కాశి, భరత్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మంద శివ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 14-11-2026
9

పోచంపల్లిలో కొంగర రావిర్యాల విద్యార్థుల పారిశ్రామిక సందర్శన..!

పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం..! విద్యార్థులకు వృత్తి విద్యలో ప్రత్యక్ష శిక్షణ..!

పెంపొందించే లక్ష్యంతో పీఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ కొంగర రావిరాల పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 9వ, 10వ తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వృత్తి విద్యలో భాగంగా ఈ సందర్శన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిని సందర్శించారు. విద్యార్థులకు అపారల్, ఆటోమోటివ్ రంగాలకు సంబంధించిన వృత్తి విద్యా నైపుణ్యాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు ఈ సందర్శనను ఏర్పాటు చేశామని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా రంగాల్లో ఉపయోగించే పనిముట్లు, పని విధానాలు, ఉత్పత్తి ప్రక్రియలు, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పరిశ్రమల పనితీరును దగ్గరగా గమనించి అనేక అంశాలను అడిగి తెలుసుకున్నారు.పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని, ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల్లో వృత్తి పట్ల ఆసక్తిని, భవిష్యత్తులో ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై స్పష్టతను ఇస్తాయని ఉపాధ్యాయులు తెలిపారు.



జర్నలిస్టులు ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలి

నిష్పాక్షికత, జవాబుదారీతనంతోనే మీడియా విశ్వసనీయత మరింత పెరుగుతుంది

టీయూడబ్ల్యూజే ఆత్మీయ మహాసభలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్





మంచిర్యాల, నవంబర్ 13 (క్రైమ్ మిర్రర్) : ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టులు, ప్రజలకు ఎల్లప్పుడూ వాస్తవ సమాచారాన్ని మాత్రమే అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) మంచిర్యాల జిల్లా ఆత్మీయ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రెండు వైపుల వాదనలు ప్రజల ముందుంచాలి: కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వాట్సాప్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం విస్తృతంగా ప్రచారమవుతూ ప్రజలను అయోమయానికి గురిచేస్తోందని, ఇలాంటి సమయంలో నిజానిజాలను పరిశీలించి వాస్తవాలను అందించాల్సిన బాధ్యత మీడియాపై మరింత పెరిగిందని అన్నారు. వివాదాస్పద అంశాలపై వార్తలు రాసేటప్పుడు సంబంధిత అధికారుల అధికారిక వివరణ కూడా తీసుకొని, రెండు వైపుల వాదనలను ప్రజల ముందుంచాలని సూచించారు. పాలన, పోలీస్, న్యాయ వ్యవస్థలతో పాటు మీడియాలోనూ పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని పేర్కొన్నారు. యూనియన్లు సభ్యుల సంక్షేమం, బీమా సౌకర్యాలతో పాటు వృత్తి నైతిక విలువలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు.

సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్టు కాలేరు: డీసీపీ భాస్కర్

మాట్లాడుతూ.. అరకొర వేతనాలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సామాజిక స్పృహతో పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమన్నారు. కెమెరా, సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరినీ పాత్రికేయులుగా పరిగణించలేమని, బాధ్యతాయుతంగా వాస్తవాలను సేకరించేవారే నిజమైన జర్నలిస్టులని స్పష్టం చేశారు. వార్తల సేకరణ కోసం వేగంగా ప్రయాణించే క్రమంలో జర్నలిస్టులు తమ కుటుంబ బాధ్యతలను గుర్తుంచుకుని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రతకు కృషి: విరాహత్ అలీ

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ.. 75 ఏళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన తమ సంఘం, గ్రామీణ విలేకరులకు గుర్తింపు, అక్రిడిటేషన్ కార్డుల కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతిక పరిణామాల నేపథ్యంలో జర్నలిస్టులకు నిరంతర శిక్షణ అవసరమని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య భద్రత కోసం సంఘం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, ఎనగందుల రవీందర్, కేశెట్టి వంశీకృష్ణ, కాచం సతీష్, జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు, వివిధ మండలాల విలేకరులు పాల్గొన్నారు.



నిరుపేదల కొండంత అండగా సీఎం సహాయ నిధి

క్రైమ్ మిర్రర్, నాంపల్లి: ప్రజా పాలనలో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 70 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహాయ సహకారాలతో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 70 మంది లబ్ధిదారుల చెక్కుల మొత్తం 22 లక్షల 79000 రూపాయలు. ఇట్టి చెక్కులను మండల కేంద్రంలో లబ్ధిదారులకు శుక్రవారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వారు మాట్లాడుతూ అనారోగ్యంతో అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులలో చికిత్స పొందిన, పొందుతున్న అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 70 మంది నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆపత్కాలంలో అందజేయడం వారికి కొండంత అండగా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరిస్తూ ఆపదలో వున్న వారికి కొండంత అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు పెద్దిరెడ్డి రాజు, నాంపల్లి ఉపసర్పంచ్ పానుగంటి తిరుమల వెంకటయ్య గౌడ్, మాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూల యాదగిరి, బీసీ మహిళ అధ్యక్షురాలు బిరుదోజు యాదమ్మ, మాజీ ఉప సర్పంచ్ సంగం గణేష్, సీనియర్ నాయకులు రమేష్ యాదవ్, బచ్చన్న బోయిన శ్రీశైలం, గాదేపాక నాగరాజు, చత్రపతి, అరుణ వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి సర్కిల్‌లో 10 రోజుల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ప్రారంభం

తొలిరోజు లక్ష్మీప్రియ కాలనీ, హనుమాన్ నగర్‌లో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



గండిపేట(క్రైమ్ మిర్రర్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో నార్సింగి సర్కిల్--45లో 10 రోజుల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను ప్రారంభించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు నార్సింగి పరిధిలోని లక్ష్మీప్రియ కాలనీ, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, చెత్త పేరుకుపోయే ప్రదేశాలు (జీవీపీలు), ఖాళీ స్థలాల్లో ఉన్న వ్యర్థాలను అధికారులు పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించి, వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను అడిషనల్ కమిషనర్ (శానిటేషన్) వేణుగోపాల్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం) అన్వేష్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా చెత్త పేరుకుపోయే ప్రాంతాలు, ఖాళీ స్థలాలను గుర్తించి పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా నిత్యం పర్యవేక్షించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. పది రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్యం కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే పరిశుభ్రమైన కాలనీలు, ఆరోగ్యకరమైన పరిసరాలు సాధ్యమవుతాయని తెలిపారు.

విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన..

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు చెక్!

నార్సింగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫ్రైడే -- డ్రై డే కార్యక్రమం..

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



గండిపేట్, (క్రైమ్ మిరర్): దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టాలంటే పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ మలేరియా స్కీమ్ అధికారులు సూచించారు. దోమల నివారణపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా శుక్రవారం (ఫ్రైడే -- డ్రై డే) కార్యక్రమాన్ని పురస్కరించుకుని పుప్పాలగూడ విలేజ్, మణికొండ డివిజన్ 127, నార్సింగి సర్కిల్ 45 పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (అర్బన్ మలేరియా స్కీమ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వివరించారు. దోమలు ఏయే ప్రదేశాల్లో వృద్ధి చెందుతాయి, వాటి రకాలు ఏమిటి, వాటి ద్వారా ఎలాంటి వ్యాధులు సంక్రమిస్తాయి అనే అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు.ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు, నీటి తొట్టెలు, ఇతర పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలను పరిశీలించి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల సంతానోత్పత్తిని అరికట్టవచ్చని తెలిపారు.

విద్యార్థులు తమ ఇళ్లలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు దోమల నివారణ చర్యల గురించి తెలియజేయాలని సూచించారు. చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా అనేక రకాల వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, సూపర్వైజర్ అబ్దుల్ సత్తార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.ఎం. నాయక్, ఎంటమాలజీ సిబ్బంది కె. యాదగిరి, టి. చంద్రమౌళి, బి. నరేష్, కె. ప్రవీణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 శనివారం 14-11-2026

రావిర్యాలలో వాడి వేడిగా భూ భారతి - భూ సర్వే...!

రైతుల భూములపై కన్నేస్తున్న 'భూ ' అక్రమార్కులు...?

భూ భారతి రీ సర్వేకు ముందు రైతుల భూములకు రక్షణ కల్పించాలి..!

కబ్జాదారులకు అధికారులే అండగా నిలుస్తున్నారంటూ గ్రామసభలో రైతుల ఆగ్రహం


నకిలీ ఓఆర్‌సీలతో భూ కబ్జాలు.. నిజమైన రైతులకు న్యాయం చేయాలని ఆర్డీఓకు వినతి

లంచాలు తీసుకొని కబ్జా దారులకు సహకరిస్తున్నారంటూ రైతుల ఆరోపణలు...!

రైతులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానం ఇచ్చిన ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి..!

రైతులకు సమాధానం చెప్పలేక వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు..





మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): రంగా రెడ్డి జిల్లా: మహేశ్వరం మండలం కొంగరఖుర్దు గ్రామంలో భూ భారతి రీ సర్వేపై నిర్వహించిన గ్రామసభ రైతుల ప్రశ్నలతో వేడెక్కింది. రావిర్యాల మహంకాళమ్మ ఆలయ ఆవరణలో కందుకూరు ఆర్డీఓ సమక్షంలో జరిగిన ఈ గ్రామసభలో రైతులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రీ సర్వేలో భాగంగా సర్వే సిబ్బంది నేరుగా రైతుల పొలాల వద్దకు చేరుకొని పట్టాదారుల సమక్షంలో డిజిటల్ సర్వే నిర్వహిస్తారని, భూముల హద్దులు, విస్తీర్ణాలను నిర్ధారించి ప్రతి కమతానికి ప్రత్యేక భూధార్ సంఖ్య కేటాయిస్తారని అధికారులు వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా భూ సరిహద్దుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

తూటాల్లాంటి ప్రశ్నల తో వాడి వేడిగా గ్రామసభ

అయితే అధికారుల వివరణపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ భూములు కబ్జాలకు గురవుతున్నా ఇప్పటివరకు పట్టించుకోని అధికారులు ఇప్పుడు రీ సర్వే పేరుతో కబ్జాదారులకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తారా? అంటూ నిలదీశారు.ముందుగా భూములపై ఉన్న వివాదాలు, అక్రమ కబ్జాలు, నకిలీ పత్రాల వ్యవహారాలపై విచారణ జరిపి నిజమైన రైతులకు న్యాయం చేసిన తర్వాతే రీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా కొంగరఖుర్దు ఏ, బీ పరిధిలోని వక్ఫ్ బోర్డు భూముల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపించారు. కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే నకిలీ ఓఆర్‌సీ పత్రాలు సంపాదించి, అధికారులను తప్పుదోవ పట్టిస్తూ భూములను కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత 50 సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న నిజమైన రైతులకు ఓఆర్‌సీలు రాకపోగా, కబ్జాలకు పాల్పడుతున్న వారికి ఒక్క రోజులోనే ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు.కబ్జా దారులతో చేతులు కలిపి సహకరిస్తున్నారంటూ ఆరోపణలు..! భూముల వ్యవహారంలో కొందరు అధికారులు డబ్బులు తీసుకొని కబ్జాదారులకు సహకరిస్తున్నారని రైతులు తీవ్ర ఆరోపణలు చేశారు. నిజమైన రైతుల సమస్యలను పట్టించుకోకుండా, అక్రమంగా భూములు స్వాధీనం చేసుకునే వారికి అధికారులు అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని కోరారు. రీ సర్వే అనేది నిజమైన రైతులకు భూ హక్కుల భద్రత కల్పించేందుకు ఉపయోగపడాలి కానీ, అక్రమార్కులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, నకిలీ పత్రాలు సృష్టించి భూములను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డికి రైతులు విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ ధికారులు స్పందించి స్థానిక రైతులకు న్యాయం చేయాలని రైతుల విజ్ఞప్తి...

భూములపై ఉన్న వివాదాలను ముందుగా పరిష్కరించి, ప్రతి రైతుకు సంబంధించిన పాత రికార్డులు, సాగు వివరాలు, హక్కుల పత్రాలను పరిశీలించిన తర్వాతే రీ సర్వే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి కార్యక్రమం నిజమైన రైతులకు భరోసా కల్పించాలే తప్ప, భూములు కోల్పోయే పరిస్థితి తీసుకురాకూడదని రైతులు కోరుకుంటున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని రైతులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, డిప్యూటీ సర్వేయర్ రమాకాంత్ రెడ్డి, సర్వేయర్ జ్యోతి, జీపీఓ అరుణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం
వెనుక భారత్ చొరవ..

ప్రధాని కీలక వ్యాఖ్యలు.. విదేశాల్లోనూ యోగాకు ప్రత్యేక గుర్తింపు..

భారత్ కృషిని ప్రస్తావించిన మోదీ

ూ-వ్ూూూ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న ప్రధాని

బెంగళూరు, కేరళలో కొత్త భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన

యోగా ద్వారా భారతీయ సంస్కృతిని తెలుసుకోవచ్చు.. ప్రధాని వ్యాఖ్యలు

బెంగళూరు: భారతీయ సంప్రదాయంలో భాగమైన యోగా ఇప్పుడు ప్రపంచ దేశాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. విదేశీ పర్యటనల సమయంలో వివిధ దేశాల ప్రతినిధులు, ప్రముఖులు తనతో యోగా గురించి మాట్లాడుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. భారతదేశం చేపట్టిన ప్రయత్నాల వల్లే ఈ ప్రాచీన సాధనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. బెంగళూరులోని స్వామి వివేకానంద యోగా అనుసంధాన్ సంస్థాన్ (ూ-వ్ూూూ) 50 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ప్రశాంతి కుటీరంలో నిర్వహించిన కార్యక్రమానికి మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో నిర్మించనున్న గోల్డెన్ జూబ్లీ బ్లాక్‌కు, కేరళలో ఏర్పాటు చేయనున్న కొత్త క్యాంపస్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. విదేశీ పర్యటనల్లో తనకు ఎదురైన అనుభవాలను ఈ సందర్భంగా ప్రధాని వివరించారు. ఆయా దేశాల్లో జరిగే విందు సమావేశాల్లోనూ యోగా అంశం ప్రస్తావనకు వస్తోందని చెప్పారు. భారత్ ప్రతిపాదనతోనే అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే స్థాయికి చేరిందని గుర్తుచేశారు. పలు దేశాలకు చెందిన రాజకుటుంబాలు సైతం యోగా సాధనను ప్రోత్సహిస్తూ, దాని విస్తరణకు తోడ్పడుతున్నాయని ప్రశంసించారు. భారతదేశ జీవన విధానం, సాంస్కృతిక మూలాలను తెలుసుకోవాలనుకునే వారికి యోగా మంచి మార్గమని మోదీ అభిప్రాయపడ్డారు. ఇది కేవలం శారీరక వ్యాయామానికే పరిమితం కాకుండా భారతీయ ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకునేందుకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. బెంగళూరులో యోగా సాధనకు సంబంధించిన అనుభవాన్ని ఆస్వాదించడం సంతోషంగా ఉందని ప్రధాని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం ఎందరో ప్రముఖ యోగా గురువులకు నిలయమని గుర్తుచేశారు. కన్నడ కంఠీరవగా పేరొందిన దివంగత నటుడు రాజ్‌కుమార్ కూడా నిత్యం యోగా అభ్యసించేవారని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సంస్థ స్వర్ణోత్సవ కార్యక్రమం సందర్భంగా కొత్త నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం ద్వారా యోగా విద్య, పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏపీ అడవుల నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన
పెద్దపులి.. సరిహద్దు గ్రామాల్లో భయాందోళన

ఏపీ నుంచి తెలంగాణలోని అశ్వారావుపేట అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిన పెద్దపులి

రేడియో కాలర్ జీపీఎస్ సిగ్నల్స్ ఆధారంగా పులి కదలికలను ట్రాక్ చేస్తున్న అధికారులు

తెలంగాణలోకి రాకముందు ఏపీలోని వేలేరుపాడు మండలంలో నాలుగు ఆవులను చంపిన పులి

ఆంధ్రప్రదేశ్ అటవీ ప్రాంతం నుంచి ఓ పెద్దపులి సరిహద్దు దాటి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోకి ప్రవేశించింది. ఆహారం కోసం అన్వేషిస్తూ వచ్చిన ఈ పెద్దపులి సంచారంతో సరిహద్దు గ్రామాలు, గిరిజన తండాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ పులికి గతంలోనే రేడియో కాలర్ (జీపీఎస్ ట్రాకర్) అమర్చడంతో దాని కదలికలను అధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన ఈ పులి... కవాడిగుండ్ల, చెన్నపురం, బచ్చువారిగూడెం అటవీ ప్రాంతాల మీదుగా గాండ్లగూడెం పరిసరాల్లోకి చేరుకున్నట్లు గుర్తించారు. "పులి తెలంగాణ అటవీ ప్రాంతంలోకి వచ్చినట్లు ఏపీ అధికారులు సమాచారం ఇచ్చారని ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ తెలిపారు." తెలంగాణలోకి అడుగుపెట్టడానికి ముందు ఏపీలోని వేలేరుపాడు మండలంలో ఈ పులి నాలుగు ఆవులను హతమార్చినట్లు అధికారులు వెల్లడించారు.

కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన మాజీ మంత్రి బుగ్గన

స్థానిక ఎన్నికల నిర్వహణలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న బుగ్గన

ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పోలీసులకు బుగ్గన విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మాజీ మంత్రి, వైసీపీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈరోజు కలిసి వినతిపత్రం అందజేశారు. రాబోయే పంచాయతీ ఎన్నికలనైనా ప్రశాంతంగా, నిష్పాక్షిక వాతావరణంలో జరిగేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన కోరినట్లు తెలిపారు. డీఐజీతో సమావేశం అనంతరం బుగ్గన మీడియాతో మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఘర్షణలు, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే టీడీపీ శ్రేణులు విపరీతమైన దాడులకు తెగబడ్డాయని, అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు మంచి గుర్తింపు ఉండేదని, కానీ ఈ దాడులు, హింసాత్మక ఘటనలతో రాష్ట్రాన్ని బీహార్‌లా మార్చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టాయని ఆయన మండిపడ్డారు.

జనసేన నేత శివ శ్రీనివాసరావు పేరుతో ఉద్యోగాల మోసం

దేవాదాయ, పోలీసు శాఖల్లో కొలువుల పేరిట నిరుద్యోగులకు వల

బాధిత యువకుడి ఫిర్యాదుతో బట్టబయలైన ఘరానా వ్యవహారం

ప్రధాన నిందితురాలు ధరణి కృష్ణ సహా నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జనసేన పార్టీ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కల్యాణ శివ శ్రీనివాసరావు పేరు చెప్పి నిరుద్యోగుల నుంచి ఏకంగా రూ.7 కోట్లు వసూలు చేసిన వ్యవహారంలో ధరణి కృష్ణ అనే మహిళను పోలీసులు మంగళగిరిలో అరెస్ట్ చేశారు. ఈ భారీ మోసానికి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి.పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన ధరణి కృష్ణ గతంలో మంగళగిరిలోని కైరెన్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో పనిచేసేది. ఆ సమయంలో శివ శ్రీనివాసరావు తనకు స్వయానా బాబాయి అని చెప్పుకుంటూ నిరుద్యోగులను నమ్మించింది. ఆయనకున్న పలుకుబడితో దేవాదాయ, పోలీసు శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఏలూరు జిల్లాలో 16 మంది, తణుకులో 20 మంది నుంచి దాదాపు రూ.7 కోట్లు వసూలు చేసింది. బాధితులు ఇచ్చిన సొమ్ముకు పార్టీ నేతదే పూర్తి పూచీ అని నమ్మబలికింది.ఈ క్రమంలో బాధితులకు అనుమానం రాకుండా ఉండేందుకు శివ శ్రీనివాసరావు ఫొటోతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్స్ సృష్టించి, ఫేక్ ఆడియో కాల్స్ ద్వారా మాట్లాడించేది. అంతేకాకుండా ప్రభుత్వ ముద్రలు, అధికారుల సంతకాలతో కూడిన నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లను తయారు చేసి నిరుద్యోగులకు అందించింది.

GHMC GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.